RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 3 ISSUE NO : 3 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శుక్రవారం, జూన్, 20, 2025 Friday, June,20,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ప్రతీ హృదయం కోరుకుంటోంది భట్టి



**హైదరాబాద్,జూన్,19,తెలంగాణ దిశ:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పుట్టినరోజు వేళ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క(ఆసక్తకిర ట్వీట్ పెట్టారు. 'లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రజల నమ్మకం, న్యాయసమాజ స్థాపనకు నడిచే మహానేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని ప్రత్యేకంగా ప్రజాభవన్‌లో మన శ్రామిక సోదర, సోదరీమణులతో కలిసి జరుపుకోవడం గర్వంగా ఉంది. పారిశుధ్య కార్మికులతో కలిసి కేక్ కట్ చేయడం.. వారితో సహపంక్తి భోజనం చేయడం నాకు ఎప్పటికీ మర్చిపోలేని అనుభూతి. పేదల కష్టాలు అర్థం చేసుకునే నేత, శ్రామికుల పక్షనా నిలిచే నాయకుడి జన్మదినం, ఈ దేశానికి నూతన దిక్సూచి కావాలని శుభాకాంక్షల వెల్లువలతో కార్మికులు ఆకాంక్షించారు. నానమ్మ ఇందిరా గాంధీ శౌర్యాన్ని, తండ్రి రాజీవ్ గాంధీ త్యాగస్వరూపాన్ని ముద్దుగా ధారించుకున్న రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని కావాలని ప్రతి హృదయం ఆకాంక్షిస్తోంది. జన్మదిన శుభాకాంక్షలు రాహుల్ జీ' అని భట్టి విక్రమార్క ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## బనకచర్ల విషయంలో

# రాజీపడే ప్రసక్తే లేదు..

## - కేంద్రమంత్రి ఎదుట కుండబద్దలు కొట్టిన సీఎం రేవంత్

**హైదరాబాద్,జూన్,19,తెలంగాణ దిశ:** తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు ప్రీ–ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ కోరారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ –1980 (జీడబ్ల్యూడీటీ), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం – 2014 లకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఫిర్యాదు చేశారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఢిల్లీలో శ్రమశక్తి భవన్‌లో కేంద్రమంత్రి పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. బనకచర్లపై అభ్యంతరాలతో పాటు నీటి వాటాలకు సంబంధించి అనేక అంశాలను కేంద్ర మంత్రికి వివరించారు.బనకచర్ల ప్రాజెక్టు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ, పర్యావరణ శాఖ వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయి. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోంది. జీడబ్ల్యూడీటీ – 1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదు. 2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మించాలనుకుంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు, జల్‌శక్తి మంత్రి అధ్యక్షతన రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలి. బనకచర్ల విషయంలో ఏపీ వీటన్నింటిని ఉల్లంఘిస్తోంది.ఏ నిబంధనలు పాటించకుండా వరద జలాల ఆధారంగా ప్రాజెక్ట్ చేపడుతున్నామని చెబుతుండడం తీవ్ర అభ్యంతరకరం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి మంత్రిత్వ శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్ట్ ముందుకెళ్లకుండా చూడాలి. సీడబ్ల్యూసీ పరిధిలోని సాంకేతిక సలహా మండలి నుంచి అనుమతులు పొందకుండానే



వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఏపీ చేపట్టింది. –1980 నిబంధనల ప్రకారం పోలవరం డిజైన్లు మార్పు చేసింది. పర్యావరణ అనుమతులకువిరుద్ధంగా పనులు చేపడుతోంది. తాము అభ్యంతరాలు లేవనెత్తినా పనులు మాత్రం కొనసాగిస్తూనే ఉంది.జాతీయ ప్రాజెక్టు పోలరంవిషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి. ఏపీ భావిస్తే..పోలవర– బనకచర్లకు బదులు కేంద్రం నిధులు ఇచ్చిఇచ్చంపల్లి – నాగార్జునసాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్లు తీసుకెళ్లే విషయంలో చర్చకు తాము సిద్ధం. కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్–2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలి.

# భాషలు లేకపోతే మనం భారతీయులమే కాదు

## ఇంగ్లీష్ మాట్లాడే వారు.. సిగ్గు పడే రోజులు ఎంతో దూరంలో లేవు పుస్తకావిష్కరణ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ, జూన్ 19:** కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడే వారు సిగ్గు పడే రోజులు రానున్నాయన్నారు. ఆ సమయం ఎంతో దూరంలో లేదని ఆయన వ్యాఖ్యానించారు.జాతి ఐక్యతకు భారతీయ భాషలే ఆత్మ వంటివన్నారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఐఏఎస్ మాజీ అధికారి అశ్‌తోష్ అగ్నిహోత్రి రచించిన పుస్తకాన్ని కేంద్ర మంత్రి అమిత్ షా అవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. దేశంలోని మన భాషలే.. మన సంస్కృతికి రత్నాలు అని అభివర్ణించారు.భాషలు లేకుంటే మనం భారతీయులమే కాదని ఆయన అభిప్రాయపడ్డారు. మన చరిత్ర, మన సంస్కృతి, మన ప్రాంతీయతను అర్థం చేసుకునేందుకు ఏ విదేశీ భాషకు సాధ్యం కాదని స్పష్టం చేశారు. విదేశీ భాషలతో భారతీయ భావనను సంపూర్ణంగా అర్థం చేసుకోలేరన్నారు. మన భాషలతో కూడిన ఆత్మ గౌరవంతో మన దేశం ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.సివిల్ సర్వీసెస్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో మార్పు అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సాహిత్యాన్ని ప్రశంసించారు. ఇది సమాజానికి ఆత్మ వంటిదన్నారు. మన దేశం కటిక చీకటి యుగంలో మునిగిపోయినప్పుడు సైతం సాహిత్యం.. మన మతం, స్వేచ్ఛ, సంస్కృతి దీపాలను వెలిగించిందని అమిత్ షా గుర్తు చేశారు. ప్రభుత్వం మారినప్పుడు.. ఎవరూ దానిని వ్యతిరేకించరన్నారు. కానీఎవరైనా మన మతం, సంస్కృతి, సాహిత్యాన్ని తాకడానికి ప్రయత్నించినప్పుడు మాత్రం మన సమాజం వారిని ఎదుర్కొని ఓడించిందని గుర్తు చేశారు. అందుకే సాహిత్యం.. మన సమాజానికి ఆత్మ వంటిదని కేంద్ర మంత్రి అమిత్ షా విశ్లేషించారు.

## వ్యవసాయ రంగంలో

# విప్లవాత్మక మార్పులు

## మంత్రి తుమ్మలతో నెదర్లాండ్ కంపెనీ ప్రతినిధులు భేటీ...



**హైదరాబాద్,జూన్,19,తెలంగాణ దిశ:** వ్యవసాయ రంగంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకు రాబోతుంది. ఈ రంగంలో టెక్నాలజీ వాడకంపై సర్కార్ ఫోకస్ పెట్టింది. వ్యవసాయ రంగంలో ఏఐ "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్" వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ మేరకు (గురువారం) నెదర్లాండ్ కంపెనీ ఏఆర్ఐక్యూటీ ప్రతినిధులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమా వేశం నిర్వహించారు. తమ సంస్థ ద్వారా రెతులకు ఒకేసారి సమాచారాన్ని అందించడం, రైతుల ఫిర్యాదులకు ఏఐ ఆధారంగా తక్షణ సూచనలు ఇవ్వడం వంటి సౌకర్యాలు కల్పి స్తామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. పంట లపై వచ్చే చీడపీడలను మొబైల్ కెమెరా ద్వారా స్కాన్ చేసి గుర్తించే టెక్నాలజీని తీసుకొస్తామని నెదర్లాండ్ కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. కాగా, లేటెస్ట్ టెక్నాలజీ అయిన ఏఐ ఇతర రంగాల మాదిరిగానే వ్యవసా యరంగంలో కూడా మెరుగైన ఫలితాలను అందిస్తుందన్న అంచనాలున్నాయి. ఏఐ (కృ త్రిమ మేధస్సు) వాడకం వ్యవసాయ రంగంలో సమస్యలకు పలు రకాల మార్గాలను సూచి స్తోందని, పంట దిగుబడులు పెంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో..

# సీఎం రేవంత్ రెడ్డి భేటీ..



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణ సర్వతో ముఖాభివృద్ధికి ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్–2047 విజన్ అద్భుతంగా ఉందని యునైటెడ్ కింగ్‌డమ్ (బ్రిటన్) మాజీ ప్రధాన మంత్రి టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. 1997–2007 మధ్య పదేళ్ల పాటు యూకేకు ప్రధానిగా సుదీర్ఘకాలం ఇంగ్లాడ్ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించిన టోనీ బ్లెయిర్.. రాజకీయాల నుంచి తప్పుకున్న తర్వాత ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లోని నాయకులకు విజన్, వ్యూహ రచన.. వాటి అమలుకు సహకరించాలనే ఉద్దేశంతో టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్‌అనే సంస్థను స్థాపించారు. ఈ సందర్భంగా భారత్ పర్యటనలో ఉన్న టోనీ బ్లెయిర్‌తో ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ (జూన్ 19న) సమావేశం అయ్యారు..ఇక, మానవ అభివృద్ధి సూచికల్లో అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

పట్టణ, పట్టణ శివారు, గ్రామీణ ప్రాంతాల వారీగా తాము అమలు చేయబోయే సూక్ష్మ ప్రణాళికను యూకే మాజీ ప్రధాని బ్లెయిర్ కి సీఎం తెలియజేశారు. తెలంగాణ రైజింగ్ 2047 ముఖ్య అంశాలను వివరిస్తూ.. ఈ విజన్‌ను 2025, డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవం సందర్భంగా ప్రజలకు వెల్లడించనున్నట్లు తెలిపారు. సుస్థిరాభివృద్ధి దిశగా ప్రణాళికలు ఉండటాన్ని యూకే మాజీ ప్రధాని ప్రశంసించారు. "భారత్ ఫ్యూచర్ సిటీ," "యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ," "యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీ" లాంటి ప్రాజెక్టులపై టోనీ బ్లెయిర్ ఆసక్తి చూపారు. ఈ విషయాలై ఇరువురు గంటకు పైగా సమావేశమైన అనంతరం తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, అమలులో భాగస్వామ్యానికి తెలంగాణ ప్రభుత్వం,ప్రతినిధులు ఉద్దేశ పత్రాన్ని పరస్పరం మార్చుకున్నారు.

## ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్స్‌లో..

# హైదరాబాద్ యూనివర్సిటీకి చోటు




**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ యూనివర్సిటీ చోటు దక్కించుకున్నది. 2026 క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ వ్యాప్తంగా 801–850 ర్యాంకుల మధ్య యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నిలిచింది. ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ యూనివర్సిటీ చోటు దక్కించుకున్నది. 2026 క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌ను గ్లోబల్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ఎనలిస్ట్ క్యూఎస్ క్వాక్వారెల్లి సైమండ్స్ విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా 801–850 ర్యాంకుల మధ్య యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నిలిచింది. మొత్తం 8467 విద్యా సంస్థలనుభారత్‌లోని 54 యూనివర్సిటీలతో సహా 106 ప్రాంతా ల్లోని 1501 విద్యా సంస్థల ప్రమాణాలను పరిశీలిం చింది.కాగా, క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2026 ఎడిషన్‌లో 'సైటేషన్స్ పర్ ఫ్యాకల్టీ' జాబితాలో ప్రపంచవ్యాప్తంగా 335వ ర్యాంక్ సాధించినందుకు తాము సంతోషిస్తున్న ట్లు హైదరాబాద్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు తెలిపారు. రెండు విభిన్న డేటాసె ట్‌లను క్యూఎస్ సేకరిస్తుందని చెప్పారు. అలాగే విద్యా సంస్థల స్థిరత్వం, ఉపాధి అవకాశాల ఫలితాలు, అంతర్జాతీయ పరిశోధన నెట్‌వర్క్, విద్య తోపాటు యజమాన్యం ఖ్యాతి, అధ్యాపక విద్యార్థి నిష్పత్తి వంటి వాటిని గ్లోబల్ ర్యాంకులకు కొలమానంగా పరిగణిస్తారని వెల్లడించారు.

# స్వప్రయోజనాల కోసం మీడియా అకాడమీ వాడుకుంటున్నారు



## - టీడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షు మామిడి సోమయ్య

**జనగామ, జూన్ 19, (తెలంగాణ దిశ) :**జర్నలిస్టు లందరికీ ఉపయోగ పడాల్సిన మీడియా అకాడమీని యూనియన్ సంస్థగా మార్చి తమ స్వప్రయోజనాల కోసం జేబు సంస్థగా వాడుకుంటున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ఆరోపించారు. చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకున్నట్లు జర్నలిస్టుల పేరు చెప్పి అధికార పదవులు పొంది పాలకులకు ఊడిగం చేస్తూ జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. అలాంటి జర్నలిస్టు సంఘాల పట్ల యావత్ జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గురువారం జనగామలోని గాయత్రి గార్డెన్ లో జరిగిన టీడబ్ల్యూజెఎఫ్ జిల్లా ద్వితీయ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టులు నిర్వర్తించిన పాత్ర కీలకమని అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో జర్నలిస్టులను ప్రభుత్వం విస్మరించడం సరైంది కాదని అన్నారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం మరింత జాప్యం చేయడం తగదని, జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మెజారిటీ జర్నలిస్టుల జీవన స్థితిగతులు దయనీయంగా మారుతున్నాయని అన్నారు. ముఖ్యంగా మండలస్థాయి విలేకరుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా ద్రోహం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా.. జర్నలిస్టుల సమస్యలను ఇంత వరకు పరిష్కరించలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఆయన ప్రకటించారు. సమస్యలపై సమిష్టి పోరాటానికి జర్నలిస్టులు సన్నద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ పాలకుల పక్షం కాదని, ఈ సంఘం ఏ ఒక్క పత్రికకు, పార్టీకి అనుబంధం కాదని మామిడి సోమయ్య స్పష్టం చేశారు. రాష్ట్రంలో రెండు జర్నలిస్టు సంఘాలు పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం నుంచి ఈ ప్రభుత్వం వరకు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని, చాలా ఏళ్ళుగా నడుస్తున్న అనేక చిన్న పత్రికలను ప్రభుత్వం గుర్తించకుండా అణచివేస్తున్నదని మామిడి సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత ఉన్న అన్ని చిన్న పత్రికలను ఎంపానల్ మెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఇతర సంఘాల నుంచి పెద్దఎత్తున టీడబ్ల్యూజెఎఫ్ లో చేరుతున్నారని చెప్పారు. రాబోయే రెండు మూడు మాసాల్లో అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ మహాసభలు పూర్తి చేసి పెద్ద ఎత్తున రాష్ట్ర మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజె) కార్యదర్శి పులిపలుపుల ఆనందం, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్ మాట్లాడుతూ జనగామ జిల్లాలో ఫెడరేషన్ ను మరింత బలోపేతం చేయాలని కోరారు. టీడబ్ల్యూజెఎఫ్ సంఘం జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ జర్నలిస్టులకు అండగా ఉంటుందని వారన్నారు. సన్నాహక కమిటీ కన్వీనర్ నరేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లాల జగన్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ కుడితాడు బాపురావు, జనగామ జిల్లా కార్యదర్శి ఎనమల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా సభ్యులకు రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య చేతుల మీదుగా గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజెఎఫ్) జనగామ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నీలా నరేష్ బాబు (మెట్రో), ప్రధాన కార్యదర్శిగా చింతకింది కృష్ణమూర్తి (స్పాట్ వాయిస్), కోశాధికారిగా కూచన సుప్రీమ్ (టి ఛానల్ ), జిల్లా ఉపాధ్యక్షులుగా చింతల మధు కృష్ణ (మన సాక్షి గొంతుక),గంగరబోయిన జానకి రాములు(దిశ), నాసగోని శ్రీనివాస్(ప్రజాదర్బార్), కార్యవర్గ సభ్యులుగా జాజాల బాలయ్య (తెలుగు ప్రభ), భాగిర్తి నరేష్ (ప్రజాదర్బార్ )వేముల నరసింగం (జ్యోతి), రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎనమల్ల సత్యనారాయణ(జనం సాక్షి), నారబోయిన గోపాల్ (జనం సాక్షి), ఐఎఫ్ డబ్ల్యు జే జాతీయ కౌన్సిల్ సభ్యులుగా గూడూరు లెనిన్ (ప్రజాజ్యోతి) తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



# వివాదంలో మేడ్చల్ కొత్త కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

## - కాంగ్రెస్ నాయకులకు రాచ మర్యాదలు
## - రైతులను, రైతు నాయకులను నిలబెట్టి మాట్లాడిన కలెక్టర్





**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 19, (తెలంగాణ దిశ)**వానాకాలం సీజన్ రైతు భరోసా నిధులు విడుదల కోసం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిను కలిసి వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన వ్యవసాయదారుల సేవా సహకార సంఘం సభ్యులను నిలబెట్టి మాట్లాడిన కలెక్టర్... అదే కాంగ్రెస్ నాయకులు వెళ్లగా కుర్చీలు వేసి కూర్చోబెట్టి మాట్లాడటం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. యువ కలెక్టర్ ఇలా ప్రవర్తించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా వానకాలం సీజన్ లో రైతు భరోసా నిధుల విడుదల విషయమై మాట్లాడుదామని కలెక్టరేట్ కు వచ్చిన రైతులకు ఈ చేదు అనుభవం ఎదురైంది. రైతు భరోసా విడుదల చేయాలని కోరుతూ ఈ సందర్భంగా రైతులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రైతు సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో ఆరు గ్రామీణ మండలాలు, ఐదు పట్టణ మండలాలు మొత్తం 11 మండలాలలో సుమారుగా 45,067 ఎకరాల విస్తీర్ణం లో 49,727 మంది రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నామని వివరించారు. ఇందుకు గాను రూ. 27.40 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. జిల్లాలోని మేడ్చల్, శామీర్ పేట, కీసర, ఘట్కేసర్, దుండిగల్, కుత్బుల్లాపూర్, అల్వాల్ మండలాలలోని గ్రామాల రైతులకు ఇప్పటి వరకు రైతు భరోసా కింద వారి ఖాతాలకు డబ్బులు జమ కాలేదన్నారు. ప్రభుత్వం ఈ ప్రాంత రైతులను రైతులుగా గుర్తించడం లేదా అనే అనుమానం కలుగుతుందన్నారు. వీరికి గత సీజనులో కూడా రైతు భరోసా డబ్బులు రాలేదన్నారు. ఎందు చేతనో ఈ ప్రాంత రైతులకు రైతు భరోసా డబ్బులు జమ చేయడం లేదో తెలియడం లేదన్నారు. కేవలం ఈ జిల్లాలో ఉన్న మూడుచింతలపల్లి మండలంలోని కొద్ది మంది రైతులకు మాత్రమే రైతు భరోసా డబ్బులు జమ అయ్యాయని వివరించారు. ప్రభుత్వానికి రైతుల పట్ల ఈ రకమైన విధానం సరి కాదని, రైతులందరికి వెంటనే రైతు భరోసా ఇవ్వాలని వారు కలెక్టర్ ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారి తెలిపారు.

# మహిళా సాధికారితే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## - మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావు






**ఖమ్మం, జూన్ 19, (తెలంగాణ దిశ) :**మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు గురువారం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జడ్ పి సెంటర్ నుంచి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం డిసిసి కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని బ్లాక్, బూత్, మండల కమిటీ అధ్యక్షురాళ్ళు, కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని కిందిస్థాయి నుంచి మరింత పటిష్ట పరిచేందుకు మహిళలు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన పేద ప్రజలకు అందే విధంగా మహిళా కాంగ్రెస్ నేతలు కృషి చేయాలని ఆలోచించారు. తొలుత కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ పథకంలో భాగంగా స్థానిక రేవతి సెంటర్ లో సన్న బియ్యం లబ్ధిదారుగుంతి భవాని ఇంట్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా సునీతా రావు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయలేదన్నారు. ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రజా ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ ఉపాధ్యక్షురాలు దుబ్బ రూపా, ప్రధాన కార్యదర్శి రేష్మ, కార్యదర్శి షేక్ భాను తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూముల్లో నిర్మాణ అనుమతులను రద్దు చేయాలి

**కుత్బుల్లాపూర్, జూన్ 19, (తెలంగాణ దిశ) :**నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ సాయి నగర్ కమాన్ వద్ద గల సర్వే నెంబర్ 141 ప్రైవేట్ ల్యాండ్ లో భూమి చూపిస్తూ 142 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమి లో జరుగుతున్న నిర్మాణాలను ప్రభుత్వం తక్షణమే ఆపాలని ఆకుల సతీష్ గురువారం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో బిఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో అప్పటి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ మరియు టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వేనెంబర్ 141 లో అనుమతి తీసుకుని 2,280 చదరపు గజాల విస్తీర్ణంలో జి ప్లస్ ఫైవ్ అంతస్తుల భవన నిర్మాణానికి నిబంధనలకు విరుద్ధంగా మాన్యువల్ అనుమతులు ఇవ్వడము చట్ట విరుద్ధమన్నారు. సర్వేనెంబర్ 142 ప్రభుత్వ భూముల్లో దాదాపు పది పూట్ల విలువైన ఎనిమిది వందల గజాల స్థలాన్ని ఆక్రమించుకొని ఈ నిర్మాణంలో కలుపుకున్నారని తక్షణమే రీ సర్వే చేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు. ఈ విషయమై పలుమార్లు బాచుపల్లి ఎమ్మార్వో కు అభ్యర్థనలు ఇచ్చిన నిర్మాణ సంస్థలు జరుగుతున్న నిర్మాణాలను ఆపలేదని ఆయన వివరించారు. ఈ విషయమై హైకోర్టును కూడా ఆశ్రయించినట్లు



అని చెప్పారు. ఈ ఆక్రమణ విషయంలో బాచుపల్లి ఎమ్మార్వో, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆయన వివరించారు. తక్షణమే ఈ విషయమై చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి, ముఖేష్, ఎల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ తో కాంగ్రెస్ నేతల భేటీ





**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 19, (తెలంగాణ దిశ) :**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరితో గురువారం జిల్లా కాంగ్రెస్ నేతలు భేటీ అయ్యారు. కలెక్టర్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి కలెక్టర్ కు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజీ శాసన సభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఆర్టిఏ నెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు






**ఏఎస్ రావునగర్, జూన్ 19, (తెలంగాణ దిశ) :**కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 55వ జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ లోని లక్ష్మీనరసింహ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజి రెడ్డి, బొజ్జ రాఘవరెడ్డి,మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, నాయకులు పాకాల రాజు, భూపాల్ రెడ్డి, అజీజ్, పెద్ది శ్రీనివాస్, అల్లూరయ్య, లింగస్వామి, అనిల్ కుమార్, మేదరి రామలింగం, భద్రగామ నరసింహ, మామిడి శ్రీనివాస్, తాళ్లపల్లి, సందీప్ గౌడ్, సింగం కిరణ్, శ్రీకాంత్ రెడ్డి, సిహెచ్ బాల నరసింహ, సలీం, సాహెబ్, పీరావలి, రావు, అక్బర్, హుస్సేన్, కాసిం వలి, దస్తగిరి, ప్రకాష్, భవాని, మాధవి, మీనా, సునీత, సంధ్య, బాజీ బాషా పాల్గొన్నారు.

# ఈ నెల 24న ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సభ విజయవంతం చేయాలి

**కుషాయిగూడ, జూన్ 19, (తెలంగాణ దిశ) :**ఈ నెల 24న బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన టీజీఎస్ ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సభను విజయవంతం చేయాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకురాలు సృజన, డిపో కమిటీ అధ్యక్షులు ఉపేందర్, కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. గురువారం కుషాయిగూడ డిపో ఆవరణలో బీసీ ఉద్యోగుల సంఘం 8వ రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు.
తెలంగాణ ఆర్టీసీ బీసీ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం డిపో కోశాధికారి బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్



సురేందర్, నాయకులు పరశరాములు, దశరథ్, గణేష్, దుర్గేష్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# పేదరికాన్ని గణించడం ఇలానా?

పేదరికం' అని వాళ్ళు పరిగణించేదానిని అంచనా కట్టే పనిలో అనేక అంతర్జాతీయ సంస్థలు ఇప్పుడు మునిగివున్నాయి. కొంత కాలం వరకూ ఈ పని ప్రపంచ బ్యాంక్ చూసేది. ఇప్పుడు ఐరాస అభివృద్ధి ప్రాజెక్టు, హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ అనే ఆక్స్‌ఫర్డ్ సంస్థ ఆ పనిలో ఉన్నాయి. ఇవేవీ వాస్తవంగా పేదరికాన్ని అంచనా కట్టే లక్ష్యంతో లేవు. నయా ఉదారవాదాన్ని అందంగా చిత్రించే పనిలో ఉన్నాయి. "కడు పేదరికం" అంటే 2011 నాటి డాలర్ కొనుగోలుశక్తి ప్రాతిపదికన రోజుకు 1.90 డాలర్లు తలసరి వినియోగం కన్నా హీన స్థాయిలో ఉండడం. అంటే తలసరి రోజుకు దాదాపు రూ.53 ఖర్చు చేయగలిగే పరిస్థితి ఉంటే అది 'కడు పేదరికం' స్థాయికి ఎగువన ఉన్నట్టే. ప్రపంచబ్యాంక్ అంచనా ప్రకారం 1990 దశాబ్దం చివరి భాగంలో ఈ స్థాయి కన్నా దిగువన సుమారు 30 శాతం ప్రపంచ జనాభా ఉండేవారు. 2022 నాటికి ఆ స్థాయికి దిగువన కేవలం 10 శాతం కన్నా కూడా తక్కువే ఉన్నారని ప్రపంచబ్యాంక్ తెలిపింది. అంటే నయా ఉదారవాద విధానాల అమలు తర్వాత కోట్లాదిమంది ప్రపంచ జనాభా కడు పేదరిక స్థాయి నుండి బైట పడ్డారు అన్నది ప్రపంచబ్యాంక్ చెప్పదలచుకుంది. ఇది పూర్తిగా లోపభూయిష్టమైన అంచనా. ఎలాగో ఇప్పుడు చూద్దాం. ప్రపంచబ్యాంక్ అంచనా కట్టే పద్ధతిలో మూడు పొరపాట్లు ఉన్నాయి. మొదటిది: ఒక వ్యక్తి దగ్గర ఉన్న సంపద పెరిగిందా, తరిగిందా అన్నది ప్రపంచబ్యాంక్ లెక్కలోకి తీసుకోకుండా కేవలం ఆ వ్యక్తి ఆదాయం పరిస్థితిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. రెండవది: ఒక వ్యక్తి ఆదాయాన్ని అంచనా కట్టడానికి ఆ వ్యక్తి చేసే వ్యయాన్ని ప్రాతిపదికగా తీసుకుంటుంది. మూడవది: వాస్తవ వ్యయాన్ని అంచనా కట్టడానికి అది ధరల సూచికను ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఈ ధరల సూచిక వాస్తవ జీవన వ్యయాన్ని సక్రమంగా ప్రతిబింబించడం లేదని అందరికీ తెలుసు. ఈ మూడు పొరపాట్ల ఫలితంగా వచ్చే నిర్ధారణలు చాలా పెద్ద పొరపాటు అంచనాలకు దారి తీస్తాయి. ఇప్పుడు ఒక్కొక్క అంశాన్నీ చూద్దాం. ఒక వ్యక్తి ఆర్థిక స్థాయిలో వచ్చిన మార్పులను పరిశీలించడానికి ఆ వ్యక్తికి వస్తూన్న ఆదాయాన్ని, ఆ వ్యక్తి వద్దనున్న సంపదలో పెరుగుదల లేదా తరుగుదలను– ఈ రెండింటినీ లెక్కలోకి తీసుకోవాలి. ఉదాహరణకు: ఒక వ్యక్తికి ఏడాది క్రితం ఎంత ఆదాయం వస్తోందో. ఇప్పుడూ అంతే ఆదాయం వస్తోందనుకోండి. కాని ఇదే ఏడాది కాలంలో ఆవ్యక్తి దగ్గరున్న సంపద కాస్తా హరించుకు పోయిందనుకోండి. అటువంటి వ్యక్తి ఆదాయంలో ఏ మార్పూ లేదు కనుక ఆర్థిక స్థాయిలోనూ ఏ మార్పూ లేదని మనం చెప్పగలమా? ఉన్న సంపద కాస్తా హరించుకుపోయినప్పుడు ఆ వ్యక్తి మరింత పేదరికంలోకి జారిపోయినట్టు కాదా? కాని ప్రపంచబ్యాంక్ పద్ధతిలో ఆ వ్యక్తి సంపద పరిస్థితి ఏమార్పులకు లోనైంది అన్న అంశం పరిశీలనలోనే ఉండదు. నయా ఉదారవాద విధానాలు అంటేనే సంపదను కొల్లగొట్టి పోగేసుకోవడం. అంటే చాలామంది వ్యక్తులను వారి వారి సంపదకు దూరం చేసి దానిని స్వాహా చేయడం. ఇటువంటి విధానాలను ఒకపక్క అమలు చేస్తూ మరొకపక్క కోట్లాది మంది పేదరికం లోంచి బైట పడ్డారని చెప్పుకోవడం అవహేళన చేయడమే. రెండవది: ఆదాయాన్ని లెక్కించడంలో కూడా వాస్తవ ఆదాయాన్ని లెక్కించకపోవడం. భారతదేశంతో సహా చాలా దేశాల్లో వ్యక్తుల వాస్తవ ఆదాయాలకు సంబంధించిన వివరాలు లేవు. ఆదాయం అంటే ఏ యే అంశాలను పరిశీలించాలి అన్నదే ఒక సంక్లిష్టమైన విషయం. అందుచేత వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవడం పరిపాటి అయింది. వ్యయానికి సంబంధించి లెక్కలు లభిస్తున్నాయి గనుక దానినే ప్రాతిపదికగా తీసుకుని వ్యక్తుల ఆదాయాలను లెక్కించడం జరుగుతోంది. వ్యయాన్ని బట్టి ఆదాయం లెక్కించాలనుకున్నప్పుడు ఆ వ్యక్తి సంపద లో వచ్చిన మార్పులను పరిశీలించకపోవడం ఏమాత్రమూ క్షంతవ్యం కాదు. ఎందుకంటే ఒక వ్యక్తి ఆదాయం పడిపోయినా, ఆ వ్యక్తి తన వద్దనున్న ఇతర సంపదను అమ్ముకుని ఆ సొమ్ముతో గతంలో మాదిరిగానే తన వ్యయాన్ని కొనసాగించవచ్చు. వాస్తవానికి ఆ వ్యక్తి పేదరికం పెరిగింది అని నిర్ధారించాలి. కాని వ్యయం స్థాయి యథాతథంగా నిలబడింది గనుక ఆ వ్యక్తి పేదరికం పెరగలేదు అని నిర్ధారించడం అర్ధరహితం కాదా ? మూడవది: వ్యయాన్ని లెక్కించినప్పుడు కూడా వాస్తవ వ్యయం ఎంతో నిర్ధారించడానికి ఆ వ్యయాన్ని ధరల సూచీతో పోల్చి సరి చేస్తారు. ఈ ధరల సూచీ వాస్తవ ధరల పెరుగుదలను ప్రతిబింబించదు. ప్రజలకు గల సాధారణ అవసరాలను బట్టి కొన్ని వస్తువులను మాత్రం లెక్కలోకి తీసుకుని వాటి ధరల్లో వచ్చే మార్పులను మార్కెట్ సర్వే ద్వారా నిర్ధారిస్తారు. దానిని బట్టి ధరల సూచీ లో మార్పులను నిర్ధారిస్తారు. ఐతే, ఎప్పటినుంచి పెరుగుదలను పరిశీలించాలి అన్నదానికి ఒక సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు (ఉదా: 1960, 1982, 2011–ఈ సంవత్సరాలను బేస్ సంవత్సరాలుగా తీసుకుని వివిధ ధరల సూచికలు రూపొందుతాయి). అయితే, అప్పటికీ, ఇప్పటికీ అవే సరుకులను అదే ప్రాధాన్యతతో ప్రజలు ఉపయోగించరు. వినియోగంలో వచ్చే మార్పులను ఈ ధరల సూచీ పరిగణనలోకి తీసుకోదు. అదే మాదిరిగా బేస్ సంవత్సరం నాడు లభించిన సరుకులు ఇప్పుడు లభించవు కూడా. ఈ మార్పులను ధరల సూచీ లెక్కలోకి తీసుకోదు. నయా ఉదారవాద విధానాలు వచ్చాక చాలా సేవలు ప్రైవేటుపరం అయ్యాయి. ముఖ్యంగా విద్య, వైద్యం. ఇవి అంతకు మునుపు ప్రభుత్వ వ్యవస్థ ద్వారా అందేవి. ఇప్పుడు వాటి ఖరీదు విపరీతంగా పెరిగిపోయింది. వాటిని వినియోగించడం ప్రజలకు అనివార్యం. కాని ధరల సూచీ ఈ రెండింటినీ ఇప్పటికీ ఉచితంగానే లభిస్తున్నవిగా పరిగణిస్తుంది. ఉదాహరణకు ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక ఆపరేషన్‌కు బేస్ సంవత్సరంలో రూ.1000 వసూలు చేసినది ఇప్పుడు రూ.2000 వసూలు చేస్తే, ఈ తేడాను మాత్రమే ధరల సూచీ లెక్కలోకి తీసుకుంటుంది. ప్రభుత్వ వైద్య వ్యవస్థ విస్తరించనందు వలన ప్రైవేటు వైద్యానికి అనివార్యంగా ప్రజలు పోవలసివస్తోంది. అక్కడ ఇదే ఆపరేషన్‌కు రూ.10,000 వసూలు చేస్తారు. కాని ధరల సూచీలో ప్రభుత్వ ఆస్పత్రులలో పెరిగిన ఫీజులను మాత్రమే లెక్కలోకి తీసుకుంటారు. వాస్తవ జీవన వ్యయం ధరల సూచీలో చూపుతున్న దానికన్నా ఎన్నో ఎక్కువ రెట్లు పెరిగింది. కాని దానిని లెక్కించనందు వలన అధికారిక ధరల సూచీని మాత్రమే పరిగణనలోకి తీసుకుని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డట్టు చిత్రిస్తారు. నిజానికి జీవన వ్యయం పెరిగిన ప్రతీ సందర్భంలోనూ ప్రజలు సర్దుబాటుకు రెండు విధాలుగా ప్రయత్నిస్తారు. మొదటిది: ఉన్న ఆస్తులను, సంపదను అమ్ముకోవడం. లేదా అప్పులు చేయడం. రెండవది: వినిమయాన్ని తగ్గించుకోవడం. అలా వినిమయాన్ని తగ్గించుకోవలసి వచ్చినప్పుడు అత్యంత అవసరమైన వాటికి మాత్రమే ఖర్చు చేస్తారు. వైద్యం అటువంటి అత్యవసరమైన ఖర్చు. ప్రైవేటీకరణ కారణంగా దాని ఖర్చు బాగా పెరిగింది. ఐనా ఖర్చు చేయక తప్పదు.

# చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలి

## - విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి : డిహెచ్ పిఎస్





కాప్రా, జూన్ 19, (తెలంగాణ దిశ) : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్ పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు కె. యేసు రత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి మేడ్చల్ జిల్లా ద్వితీయ మహాసభల సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు యేసు రత్నం జెండా ఆవిష్కరించారు. ఈసీఐఎల్ సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం గాలం లక్ష్మీనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశం ముఖ్యఅతిథిగా హాజరైన దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో దళితులకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు, వేధింపులు పెరిగిపోతున్నాయని అన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మి వేసి రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తుందని అన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తుందని అన్నారు. ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం పేదలకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధుల కోత పెట్టి పథకాన్ని రద్దు చేయడానికి చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు యేసు రత్నం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చి 18 నెలలు అవుతున్న చేవెళ్ల డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో దళితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ గురుకులాలను రద్దు చేయడానికి కుట్రలు చేస్తుందని అన్నారు. ప్రైవేటు పాఠశాల విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సైతం విద్యాహక్కు చట్టం అమలుపై ప్రభుత్వం చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రెండవ రాష్ట్ర మహాసభలు జూలై 7, 8 తేదీల్లో వరంగల్ హంటర్ రోడ్ లోని పిఆర్‌ఆర్‌పిసి కన్వెన్షన్ లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నాయకులు కె. సాదేవ్, వై. ఉషాశ్రీ , నర్సింగరావు, సాయిలు, బొట్టు రమేష్, మహేష్, సదానందం, రజిని, కోమల తదితరులు పాల్గొన్నారు.

# నాగారంలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా వివిధ కార్యక్రమాలు

## - సందర్శించిన సిడిఎంఎ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న








**నాగారం, జూన్ 19, (తెలంగాణ దిశ)** :తెలంగాణ ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికలో భాగంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సిడిఎంఎ) అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న , మున్సిపల్ కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో 3వ వార్డులోని పార్క్ లో బ్లాక్ ప్లాంటేషన్ మొక్కలు నాటారు. వీధి కుక్కల నియంత్రణ ఎబిసీ కెన్నెల్ సందర్శించి వాటికీ పిల్లలు కన కుండా ఆపరేషన్ చేయాలని సూచనలు చేసారు. కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని సందర్శించి అందులో నుండి వేస్ట్ వాటర్ పోవడానికి కాలువ లాగా చేయాలని డిఈకి సూచించారు. నాగారం మహిళా సంఘాల సమాఖ్య మహిళలతో ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. మహిళా సంఘాలు తయారు చేస్తున్న వస్తువుల పైన మీ యొక్క సంఘాల పేర్లు అడ్రస్, ఫోన్ నెంబరు పెట్టాలని సంఘాలకు సూచనలు చేశారు. మీరు చేస్తున్న వస్తువులకు వాటి యొక్క ప్రాముఖ్యత గురించి ప్రచారం చేసి వస్తువుల అమ్మకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మహిళలకు సూచించారు. అదే విధంగా మహిళ సమాఖ్య, సర్ఫ్ వారి యొక్క వస్తువులను వారు చేసిన వంటలను ప్రాజెక్టు డైరెక్టర్ సందర్శించి చాలా సంతోషం వ్యక్తం చేశారు. అదే విధంగా మురికి కాలువలో రీసెల్టింగ్ వాటర్ ను సందర్శించి రేలింగ్, మెస్ ఫెన్సింగ్ చేయాలని ఆమె సూచించారు. రోడ్డు విస్తరణలో పోతున్న కారణంగా మెష్ తీసి వేసినట్లు కమిషనర్ వివరించారు. అదే విధంగా వర్తక వ్యాపార లైసెన్సుల విధానాన్ని సందర్శించారు. ప్రభుత్వ స్కూల్ ను సందర్శించి న్యూరల్ పెయింటింగ్ ను చూసి సంతోషంగా వ్యక్తం చేశారు. అదే విధంగా నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి నీళ్ళు పోశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# లైఫ్ లైన్ తులసి ఆసుపత్రిలో ఉబాకాయానికి అరుదైన శస్త్ర చికిత్స






**కాప్రా, జూన్ 19, (తెలంగాణ దిశ)** :ఈసీఐఎల్ లోని లైఫ్ లైన్ తులసి ఆసుపత్రి వైద్యులు ఇద్దరు విదేశీ మహిళలకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. శ్రీలంక దేశం కొలంబోకు చెందిన మహిళలు 106 కిలోల ఉబకా యంతో వివిధ అరోగ్య సమస్యలతో బాదపడుతున్నారు. వారికి గత మంగళవారం ఈసీఐఎల్ లోని లైఫ్ లైన్ తులసి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆస్పత్రి చైర్మెన్ ఛీఫ్ సర్జన్ డాక్టర్ జెఎన్ రాజ్ కుమార్, జాయింట్ మెనేజింగ్ డైరెక్టర్ అనిరుధ్ రాజ్ కుమార్ సారథ్యంలో శస్త్ర చికిత్స పూర్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక బరువు ఉబకాయంతో బాధపడే వారికి గుండెపోటు, బీపీ, మూత్రపిండాల వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. అలాంటి వారు చికిత్స తీసుకోవడం ఉత్తమమని తెలిపారు. అధిక బరువు, ఉబకాయంతో బాధపడే వారు బేరియాట్రిక్, మెటాబాలిక్ శస్త్రచికిత్స తీసుకోవడం మంచిదని శాస్త్రీయంగా నిరుపితమైందని తెలిపారు. ఈస్ట్ హైదరాబాద్ నగరంలోనే మూడు వందల పడకలతో అన్ని రకాల చికిత్సలు లైఫ్ లైన్ తులసి ఆస్పత్రిలో చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**మల్లాపూర్, జూన్ 19, (తెలంగాణ దిశ)** :మల్లాపూర్ డివిజన్ లోని ఎస్ వై సి మున్సిపల్ గ్రౌండ్స్ వద్ద గురువారం ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్‌ఉప్పల్ మాజీ ప్రధాన కార్యదర్శి కోయలకొండ రాజేష్, డిసిసి మాజీ ఉపాధ్యక్షులు మొసలి శ్రీనివాస్ రెడ్డి, మల్లాపూర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ నాయకులు, మహిళ నాయకురాళ్లు పాల్గొన్నారు.


# చీర్యాలలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



**దమ్మాయిగూడ, జూన్ 19, (తెలంగాణ దిశ)** :దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని చీర్యాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లను దమ్మాయిగూడ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా గురువారం పరిశీలించారు. అదే విధంగా అహ్మద్ గూడ నాలుగవ వార్డులోని ప్రభుత్వ పాఠశాల, వీకర్ సెక్షన్ కాలనీలో అంగన్ వాడి స్కూల్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ ఎ. నాగమణి, డిఈఈ బాల మురళి, డిఈఈ భగవంత్ రావు, చీర్యాల గ్రామ పంచాయతీ కార్యదర్శి నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు టీ-సాట్ లో ఇంజనీరింగ్ కొత్త కోర్సుల సందేహాలపై ప్రత్యక్ష ప్రసారం



**శేరిలింగంపల్లి, జూన్ 19, (తెలంగాణ దిశ)** :ఇంజనీరింగ్ లో కొత్త కోర్సులు, బ్రాంచ్ ల ఎంపిక, విద్య, ఉద్యోగ అవకాశాలతో సహ ఉస్మానియా విశ్వ విద్యాలయం అందిస్తున్న వివిధ కోర్సులపై విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ కుమార్ మొలుగరంతో టీ–సాట్ ప్రత్యక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ప్రసారం చేస్తున్నట్లు టి–సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్‌లో టాప్ బ్రాంచ్‌లు రోబోటిక్స్ ఇంజినీరింగ్ లో ఉద్యోగ అవకాశాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రత్యేకతలు, సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ తదితర విభాగాల్లో ఎలాంటి ఉద్యోగాలున్నాయి? ఇంజినీరింగ్ చేసిన వారు ఎక్కువగా విదేశాలకు వెళ్ళడానికి కారణాలు ఏమిటి? వంటి ప్రశ్నలకు విసి విద్యార్థులకు సమాధానాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 12.30 వరకు లైవ్ షోలో 040 2354 0326, 2354 0726, టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4039 సంప్రదించవచ్చని వేణుగోపాల్ రెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.

# రేపు 21న జిల్లా కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**కుషాయిగూడ, జూన్ 19, (తెలంగాణ దిశ)** :జాతీయ, తెలంగాణ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు ఈసీఐఎల్ లోని జిల్లా కోర్టు ప్రాంగణంలో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక శ్రేయస్సును ప్రోత్సహించే నిమిత్తం ఈ నెల 21న ఉదయం ఏడు గంటలకు "అంతర్జాతీయ యోగా డే" వేడుకలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ ఎస్ ఎన్. శ్రీదేవి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.



# ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి: బిజెపి






**కుత్బుల్లాపూర్, జూన్ 19, (తెలంగాణ దిశ) :**ప్రగతి నగర్ లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ ప్రగతి నగర్ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి ట్రాఫిక్ సీఐ ప్రశాంత్ రెడ్డి ని కోరారు. గురువారం ప్రగతి నగర్ కు చెందిన పలువురు స్థానికులతో కలిసి ఆయన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐకి ప్రగతి నగర్ లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా పలు సూచనలు సిఐకి అందించారు. ట్రాఫిక్ పోలీస్ ఇన్ స్పెక్టర్ ను కలిసిన వారిలో పార్లమెంట్ మీడియా సెల్ కన్వీనర్ సుమన్ రావు, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ రాజు, రచ్చ చక్రధర్, రవి యాదవ్, శ్రీధర్ రెడ్డి, మదన్ గౌడ్, నరేష్, సత్యనారాయణ, శివకుమార్, వేణుమాధవ్, అనిరుద్ర, సాయికిరణ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలి

## - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,జూన్ 19, (తెలంగాణ దిశ) :**ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ఫీజులలో రాయితీ ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఫీజులలో 50 శాతం వరకు రాయితీ ఇవ్వాలని ఆయన విద్యాసంస్థల యాజమాన్యాలను కోరారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని అన్ని స్కూళ్లు కాలేజీలలో స్వయంగా తిరిగారు. కార్పొరేట్ స్కూళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు ఫీజులలో రాయితీ ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో కార్మిక, పేద, మధ్యతరగతి కుటుంబాలు అధికంగా ఉంటాయన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొనిప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ఫీజులలో రాయితీ ఇచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**కుత్బుల్లాపూర్, జూన్ 19, (తెలంగాణ దిశ) :**ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అగ్రనేతరాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు గురువారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించు కొని కేక్ కట్ చేసి కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకరికొకరు తినిపించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇంచార్జీ కోలన్ హనుమంత రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పలు డివిజనల కాంగ్రెస్ పార్టీ నేతలు, మహిళా నాయకురాలు నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# యువతులకు బాసట.. ఉపాధిలో ఊరట..!

**కాకినాడ,తెలంగాణ దిశ:**డ్వాక్రా మహిళల కుటుంబాల్లో విద్యావంతులైన యువతుల స్వయం ఉపాధికి అడుగులు పడుతున్నాయి. చదువుకుని ఖాళీగా ఉన్న అలాంటి వారిని గుర్తించి, వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. వీరి కోసం కొత్తగా ఇరుగుపొరుగునే వ్యాపారం (నైబర్‌హుడ్ బిజినెస్) విధానాన్ని తీసుకురాబోతోంది.. చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న మహిళలు, యువతులతో ప్రత్యేకంగా డ్వాక్రా తరహాలో సంఘాలను ఏర్పాటు చేయాలనేది లక్ష్యం. తదుపరి దశలో డ్వాక్రా మహిళల కుటుంబాల్లోని పురుషులు, యువకులకూ విస్తరించాలని యోచిస్తున్నారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లాలో నైబర్‌హుడ్ బిజినెస్ విధానంపై డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సెర్ప్ సిబ్బంది సర్వేపూర్తి చేశారు. 1,123 గ్రామ సంఘాల్లోని 39,524 డ్వాక్రా సంఘాలకు చెందిన 4,08,198 మంది సభ్యులపై ఈ సర్వే జరిగింది. 56,108 మంది నిరుద్యోగులు స్వయం ఉపాధి కల్పించాలని కోరారు. ఆసక్తి ఉన్న మహిళలు, యువతులకు



ఉపాధి కల్పించేందుకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) శాఖతో అనుసంధానం చేయనున్నారు. ఇంటి నుంచి దూరం వెళ్లకుండా ఎక్కడికక్కడ వారి ఆసక్తికి అనుగుణంగా స్వయం ఉపాధి కల్పించాలన్నదే నైబర్‌హుడ్ బిజినెస్ లక్ష్యం. వీరిని గ్రూపులుగా ఏర్పరచి, సహకార సంఘాల కింద రిజిస్టర్ చేస్తారు.

# కుంటుపడుతున్న పట్టణాభివృద్ధి..?

**రాయదుర్గం,తెలంగాణ దిశ:**జిల్లాలోని నగరపాలక, పురపాలక సంఘాల్లో కొన్ని నెలలుగా పన్నుల వసూళ్లు మందగించాయి. ఫలితంగా ఖజానాలు ఖాళీ అవుతున్నాయి. కొన్నింటిలో లక్ష్యాలు అధిగమించినా.. ఎక్కువ మున్సిపాలిటీల్లో వెనుకబడ్డాయి. దాంతో పట్టణాభివృద్ధి కుంటుపడుతోంది. రోడ్లు, మురుగు కాలువలు వంటి పనులకు ప్రభుత్వ గ్రాంట్లపై ఆధారపడాల్సి వస్తోంది. గత వైకాపా పాలనలో వివిధ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనులు కూడా పడకేశాయి. వాటిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడంతో పట్టణాభివృద్ధిపై అనిశ్చితి నెలకొంది. పురపాలక సంఘాల్లో కొన్నేళ్లుగా పారిశుద్ధ్య కార్మికుల నియామకాలు జరగడం లేదు. దాంతో ఔట్‌సోర్సింగ్ కార్మికులను నియమించారు. వారికి సాధారణ నిధులతోనే జీతాలు ఇవ్వాల్సి వస్తుంది. ఎక్కువ భాగం నిధులు వారి జీతాలకే సరిపోతుంది. వీధి దీపాలకు ప్రతినెలా ఎల్‌టీ(లోటెన్షన్), నీటి నిర్వహణకు అయ్యే హెచ్‌టీ(హైటెన్షన్) బిల్లులు కూడా రూ.లక్షల మేర చెల్లించాల్సి ఉంటుంది. పారిశుద్ధ్య నిర్వహణకు మందులు, పరికరాలు, డీజిల్ బిల్లులు, తాగునీటి శుద్ధికి కోలరిన్ గ్యాస్, ఆలం కొనుగోళ్లు, విద్యుత్తు నియంత్రికలు, మోటార్లు, లీకేజీ మరమ్మతులు, మున్సిపల్ ఖర్చులకు పన్నులపైనే ఆధారపడాల్సి ఉంటుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 12 పురపాలక సంఘాలు ఉన్నాయి. గత ఏప్రిల్ ఒకటి నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు అర్ధ భాగం, అక్టోబరు 1 నుంచి 2025 మార్చి నెలాఖరు వరకు రెండో అర్ధ భాగం ఆయా పట్టణాల్లో వార్షిక పన్నులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్థిక సంవత్సరంలో అర్ధ భాగం పూర్తయ్యింది. సాధారణ ఎన్నికలు, ఉద్యోగుల బదిలీలు, కరవు పరిస్థితులతో వ్యాపారాలు



తగ్గటం, ఇసుక కొరతతో పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని రెండో అర్ధ భాగంలో చెల్లిస్తామనుకోవటం తదితర కారణాలతో పన్నులు వసూలు కాలేదు. ఆస్తి పన్ను వసూళ్లు వేగవంతం చేసేందుకు 125 రోజుల ప్రణాళికతో బృందాలు ఏర్పాటు చేస్తాం.

రోజువారీలక్ష్యాలను నిర్దేశిస్తాం. ఎక్కువ బకాయిలు చెల్లించని వంద మంది జాబితాలు సిద్ధం చేసి, వసూలు చేస్తాం. మూడేళ్లకు పైబడి బకాయిదారులపై ఛార్జిషీట్లు దాఖలు చేసి కోర్టుకెళతాం. రెవెన్యూ రికవరీ యాక్టు కింద ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పన్నుల బకాయి వసూళ్లు చేపడతాం.

# సరకుల మూట.. పొదుపు బాట

**కళ్యాణదుర్గం,తెలంగాణ దిశ:** రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘాల(ఎఫ్‌పీవో) సభ్యులు వినూత్నంగా ఆలోచించారు. గ్రామాల్లో 'రైతు అంగడి' ఏర్పాటు చేసి పండగల పూట నిత్యావసర సరకులు విక్రయిస్తున్నారు. వారి ప్రయత్నం సత్ఫలితాన్నిస్తోంది. ఆ వచ్చిన లాభాలను పొదుపు చేస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నారు. జిల్లాలోని కళ్యాణదుర్గం, కూడేరు, కుందుర్పి, బెళుగుప్ప, శెట్టూరు, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో 14 రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘాలు(ఎఫ్‌పీవో) ఉన్నాయి. వాటిలో 5వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరంతా సమావేశమై పండగల సమయంలో కాస్త తక్కువ ధరకే ఓ కుటుంబానికి సరిపడే నిత్యావసరాలు విక్రయించాలని ఆలోచించారు. వీరికి ఏఎఫ్ ఎకాలజీ ప్రోత్సాహం అందిస్తోంది. మొత్తం రూ.14 లక్షల విలువైన 16 రకాల సరకులను హోల్‌సేల్‌గా కొనుగోలు చేశారు. వాటిని ఓ సంచిలో ఉంచి దసరా కిట్‌గా తయారు చేశారు. కిట్లను గ్రామాల్లో 'రైతు అంగడి' ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు 1000 కిట్లు తయారు చేశారు. ఒక్కోటి రూ.700కు అమ్ముతున్నారు. ఒక్కో కిట్టుపై రూ.50 లాభం వచ్చేలా నిర్ణయించారు. అది కూడా వారి



ఎఫ్‌పీవోల పొదుపులోకి చేరనుంది. దీపావళి నాటికి 3వేల కిట్లు విక్రయించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. పండగకు అవసరమైన సరకులు కొనేందుకు గ్రామీణులు పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది. అందుకు వారు పనులు వదులుకుని, ఓ రోజంతా కేటాయించాలి. పైగా వ్యయ ప్రయాసకులోను కావాల్సి వస్తుంది. దీన్ని గుర్తించిన ఎఫ్‌పీవోలు పండగ సరకులను కిట్లుగా తయారు చేసి స్థానికంగా విక్రయిస్తున్నారు. ప్రజలు సైతం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

# ఉచిత శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

**కల్లూరు,తెలంగాణ దిశ:** వివిధ అంశాల్లో తీర్చిదునిస్తోంది. శిక్షణతో సరిపెట్టక అర్హులైనవా రికి రుణాలిచ్చి తమ కాళ్లపై తాము నిలబడేలా తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే వేలాది మంది శిక్షణ తీసుకుని స్వయం ఉపాధి సాధించడం విశేషం. కర్నూలు నగరంలో కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను 2003లో ప్రారంభించారు. అప్పటినుంచి గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు నిరంతరం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 10,13,30 రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ఈ సమయంలో వారికి ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తారు. ప్రతి నెలా ఏదో ఒక రంగంలో తర్ఫీదు ఇస్తుంటారు. యువతలో నైపుణ్యా లను వృద్ధి చేసి స్వయం ఉపాధి కల్పించడమే సంస్థ ముఖ్య ఉద్దేశం. సంస్థ ప్రారంభించినప్పటి నుంచి నేటివరకు 8,788 మందికి శిక్షణ ఇచ్చారు. ఇందులో పురుషులు 2,291 మంది,మహిళలు 6,497 మంది ఉన్నారు. 2,401మందికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించారు. పురు షులకు ద్విచక్రవాహన మరమ్మతులు, సర్వీసింగ్, చరవాణుల రిపేరు, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ఎలక్ట్రికల్ హోం వైరింగ్, ప్లంబింగ్, శానిటరీ, ఎలక్ట్రికల్ మోటారు రీవైండింగ్, టైలరింగ్, డ్రస్ డిజైనింగ్ ఫర్ మెన్, సీసీటీవీ కెమెరా ఇన్‌స్టలేషన్ సర్వీసింగ్, కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, పాడిపరిశ్రమ, వర్మీ కంపోస్టు తయారీ, గొర్రెల పెంపకం తదితర వాటిపై శిక్షణ ఇస్తారు. మహిళలకు టైలరింగ్, డ్రస్ డిజైనింగ్, బ్యూటీషియన్, పెళ్లికుమార్తె మేకప్, మెహందీ వర్క్, జ్యూట్ బ్యాగుల తయారీ, మగ్గం, ఫ్యాబ్రిక్, పెయింటింగ్ తదితర వాటిల్లో శిక్షణ ఉంటుంది. కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఆయా వృత్తిలో శిక్షణ పొందాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి



ఉంటుంది. ఏఏ రంగాలలో శిక్షణ ఇస్తారో సంస్థ ప్రతినిధులు ముందుగా పత్రికా ప్రకటనల ద్వారా, గ్రామాల్లో పొదుపు సంఘాల ద్వారా, ఆయా ప్రభుత్వ శాఖలు, సామాజిక మాధ్య మాల ద్వారా సమాచారం ఇస్తారు. మరిన్ని వివరాలకు కల్లూరు తహసీల్దారు కార్యాలయం సమీపంలోని సంస్థ కార్యాలయంలో ప్రతినిధులను సంప్రదించవచ్చు. సంస్థలో నిరంతరం శిక్షణ కార్యక్రమాలు జరుగుతుంటాయి. తూతూమంత్రంగాకాక వృత్తిపై పట్టు సాధించేలా ఉంటుంది. ప్రాక్టికల్స్ సైతం నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణత సాధిస్తే ధ్రువపత్రం ఇస్తారు. దీనిద్వారా బ్యాంకుల నుంచి రుణం పొంది స్వయం ఉపాధిలో రాణించేందుకు అవకాశముంటుంది. ఆసక్తి కలిగిన వారికి రుణాలు మంజూరు చేయించి ఆర్థిక తోడ్పాటు అందిస్తుంటారు. దీంతోపాటు శిక్షణ పూర్తైన తర్వాత యువతకు.. ఆయా వృత్తులకు సంబంధించిన కిట్లను సైతం ఉచితంగా అందజేస్తున్నారు.

# విచారణలో పట్టు.. వీడనున్న గుట్టు..?



**కుక్కునూరు,తెలంగాణ దిశ:** వైకాపా హయాంలో రూ.13 కోట్ల విలువైన రాయితీపై అందించిన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాల గుట్టును అధికారులు విప్పను న్నారు. అవి క్షేత్ర స్థాయిలో ఉన్నాయో.. లేవో పరిశీలించి నివేదిక అం దజేయాలని ఎన్డీయే ప్రభుత్వం వ్యవసాయ శాఖను ఆదేశించింది. ఈ నేపథ్యంలో గత నెలలో అధికారులు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. చాలాచోట్లలబ్ధిదారుల వద్ద అవి లేవని తేలింది. నిబంధనల ప్రకారం రైతుభరోసా కేంద్రాల్లో ఉంచి,అవసరమైన రైతులకు తక్కువ ధరకు అద్దెకివ్వాలన్నది నిబంధన. కానీ లబ్ధిదారులంతా వైకాపా నాయకులు కావడంతో ట్రాక్టర్లు సహా పరికరాలన్నీ వారి ఇళ్లకే చేరాయి. కొన్నిచోట్ల ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన వాటిని బినామీల పేరుతో చేజిక్కించుకున్నట్లు తేల్చారు. 10శాతం చెల్లిస్తే చాలు..ధరలో కేవలం 10శాతం చెల్లిస్తే చాలు ట్రాక్టర్లు, ఇతర పరికరాలు అప్పట్లో అప్పగించారు. ఇందులో 50 శాతం బ్యాంకు రుణం, 40శాతం ప్రభుత్వ రాయితీగా ఉంది. పూర్తి లాభసాటి వ్యవహారం కావడంతో నాయకులే లబ్ధిదారులయ్యారు. నిబం ధనలు పాటించాల్సిన వ్యవసాయశాఖ అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గింది. ఇదీ లక్ష్యం.. రైతు సేవా కేంద్రాల(గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలు) పరిధిలో కస్టమ్ హైరింగ్ కేంద్రాలుఏర్పాటు చేసి పథకం అమలు చేశారు.

# రూపు రేఖలు మారనున్న చర్లపల్లి చెరువు

## చెరువును సందర్శించిన ఉన్నతాధికారులు - అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్న హైడ్రా





**హైదరాబాద్, జూన్ 19, (తెలంగాణ దిశ) :** చర్లపల్లి చెరువు రూపు రేఖలు మారనున్నాయి. మంచినీటి సరస్సుగా రూపొందించడమే కాకుండా.. నయన మనోహరంగా దీనిని తీర్చిదిద్దనున్నారు. జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ శ్రీమతి సౌమ్య మిశ్రా ఆహ్వానం మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం చర్లపల్లి చెరువును సందర్శించారు. జైళ్ల శాఖ, హైడ్రాతో పాటు.. స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులుకూడా ఈ పర్యటనలో ఉన్నారు. చర్లపల్లి జైలు ప్రాంతంలో ఉన్న 58 ఎకరాల చర్లపల్లి చెరువును ఆధునీకీకరించడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దడంపై ఇరువురు ఉన్నతాధికారులు చర్చించారు. చెరువు చుట్టూ తిరిగి.. ఇన్‌లెట్, ఔట్‌లెట్‌లను పరిశీలించారు. ప్రస్తుతం చెరువులో కొద్ది మొత్తం నీరు ఉన్నా పరిశుభ్రంగా ఉండడంతో జీవవైవిద్యానికి అవకాశం లభించిందని.. ఇంకా ఈ చెరువు నిండా నీరుంటే మరింత ఆహ్లాదంగా మారుతుందని భావించారు. ఈ క్రమంలో చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి.. పర్యాటక, విహార కేంద్రంగా తీర్చిదిద్దడంపై చర్చించారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు.. కట్టను బలోపేతం చేసి పాత్‌వేను అభివృద్ధి చేయడం వెంటనే చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. అలాగే సోలార్ లైటింగ్ సిస్టమ్‌తో పాటు.. సీసీటీవీ కెమేరా వ్యవస్థను ఏర్పాటు చేస్తే మరింత భద్రత ఉంటుందని భావించారు. ఇలా చెరువులో మంచి నీరు నిలిచేందుకు చేపట్టాల్సిన చర్యలను చర్చించారు. ఇందుకు సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందించాలని హైడ్రా ఇరిగేషన్ ఇంజినీరింగ్ విభాగానికి హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు సూచించారు. హకీంపేట నుంచి నాగిరెడ్డి కుంట, కాప్రా చెరువు, మోతుకులకుంట, బైసన్‌కుంట గొలుసు కట్ట చెరువుల ద్వారా చర్లపల్లి చెరువుకు నీరందుతుంది. ఈ చెరువుకు.. మురుగు నీరు కలవకుండా డైవర్ట్ నాలా కూడా ఉంది.

చెరువు చుట్టూ దాదాపు 3 కిలోమీటర్ల మేర నడక దారి అందుబాటులోకి వస్తుంది. చుట్టూ పాత్‌వే, మినీ పార్కులు, చెట్లు, సీటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు.. సీసీ టీవీ కెమేరాలు ఏర్పాటు చేస్తే స్థానికులే కాకుండా ఇదో విహార కేంద్రం అవుతుంది. చర్లపల్లి పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు సామాజిక బాధ్యత (సీఎస్ ఆర్) కింద నిధులు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నారని శ్రీమతి సౌమ్య మిశ్రా చెప్పారు. ఒక్కో సెగ్మెంట్‌కు ఎంత ఖర్చు అవుతుందో సమగ్ర నివేదిక ఇస్తే ఆ క్రమంలో సీఎస్ ఆర్ నిధులు అడగడానికి వీలౌతుందన్నారు. అంతకు ముందు చెరువుకు సంబంధించిన వీడియో చిత్రాలను, చెరువు అభివృద్ధికి చెందిన ప్రణాళికలను జైళ్ల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో చూపించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అగ్నిమాపక శాఖ అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, జైళ్ల శాఖ ఐజీ మురళీ బాబు, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్, ఓపెన్ జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## మీ జిమెయిల్ స్టోరేజీ పూర్తిగా నిండిపోతే ఇలా చేస్తే సరిపోతుంది!

నేటి యాంత్రిక కాలంలో జిమెయిల్ అకౌంట్ లేకుండా ఏ ఒక్కరు ఉండరు అనేది తెలిసిన విషయమే. అదేవిధంగా స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరికి జీమెయిల్ అకౌంట్ అనేది ఉంటుంది. ఎందుకంటే ఈమెయిల్ అకౌంట్ లేకుండా అసలు ఫోన్ ఆన్ చేయడమే చాలా కష్టం. ఆండ్రాయిడ్ ఫోన్లలో ఇది తప్పనిసరి కావడంతో జిమెయిల్ అకౌంట్ అనేది తప్పనిసరి అయిపోయింది. అయితే గత కొంతకాలంగా స్మార్ట్ ఫోన్ యూజర్లను ఒక సమస్య వేధిస్తోంది. నీ జీమెయిల్ స్టోరేజీ 15 జిబి పూర్తిగా అయిపోయిందని ఓ మెసేజ్ వస్తూ, ఇంకాస్త స్పేస్ కావాలంటే కొనుగోలు చేయమని గూగుల్ మెసేజ్ లు పెడుతుండడంతో చాలామంది వినియోగదారులు కంగారుపడుతున్నారు. అయితే ఇక్కడ అందరికీ స్పేస్ కోసం డబ్బులను వెచ్చించే స్తోమత అందరికీ ఉండకపోవచ్చు. సాధారణంగా ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ, ఫోటోలు వీడియోలు క్రమం తప్పకుండా తీయడంతో, ఆ 15 జిబి కొద్ది సమయంలోనే బ్యాకప్ రూపంలో నిండిపోవడంతో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఇట్టే మనం అర్థం చేసుకోవచ్చు. అయితే అలాంటప్పుడు కొన్ని చిట్కాలు ద్వారా స్టోరేజీని మ్యారేజ్ చేసుకోవచ్చని కొంతమంది నిపుణులు చెబుతున్నారు. దానికోసం గూగుల్ స్టోరేజ్ ఆప్షన్ లోకి వెళ్లి 'క్లీన్ అప్' ఆప్షన్ ఎంచుకొని అవసరమైన డేటాను ఉంచుతూ, అవసరం లేని డేటాను డిలీట్ చేయడం ద్వారా కొంత మేర స్పేస్ సంపాదించవచ్చు. అదేవిధంగా, ఎక్కువ



మోతాదులో స్పేస్ ఆక్యుపై చేసిన ఫైళ్లను కంప్రెస్ (కుదించడం) చేయడం ద్వారా మరికొంత స్పేస్ పునరుద్ధరణ చేయవచ్చు. అదేవిధంగా ఎక్కువగా ఎవరైనా గూగుల్ క్రోమ్ వంటి వాటిని వాడినట్లయితే, అందులోని గత హిస్టరీని తొలగించడం ద్వారా కొంతమేర స్పేస్ సంపాదించవచ్చు. ఇక స్మార్ట్ ఫోన్లు ఉపయోగిస్తున్నటువంటి ప్రతి ఒక్కరు తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే, మీరు ఎలాంటి ఫోటోని క్లిక్ చేసిన, అది గూగుల్ క్లౌడ్ లో స్టార్ కాబడుతుంది కాబట్టి, అవసరమైనప్పుడు మాత్రమే మీ ఫోన్ కెమెరాను వాడవలసిందిగా నిపుణులు సూచిస్తున్నారు.

## భారతదేశంలో అత్యధిక దేవాలయాలు ఉన్న రాష్ట్రాలు ఏవో తెలుసా..

భారతదేశంలో దేవాలయాల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది అనే విషయం మన అందరికీ తెలిసిందే. కొన్ని ప్రాంతాలలో మరీ ముఖ్యంగా ఎక్కువ దేవాలయాలు ఉంటూ ఉంటాయి. ఇక ఏదైనా ప్రసిద్ధి పొందిన దేవాలయం ఉంది అంటే దాని చుట్టు పక్కల కూడా పెద్ద ఎత్తున దేవాలయాలు ఉంటాయి. ఇకపోతే భారత దేశంలో అత్యధిక దేవాలయాలు కలిగిన టాప్ 7 రాష్ట్రాలు ఏవి ..? ఆ రాష్ట్రాలలో ఎన్ని దేవాలయాలు ఉన్నాయి అనే వివరాలను తెలుసుకుందాం.రాజస్థాన్ : రాజస్థాన్ రాష్ట్రం భారతదేశంలో ఎక్కువ దేవాలయాలు కలిగి ఉన్న లిస్ట్ లో ఏడవ స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో 39000 దేవాలయాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ : భారతదేశంలో అత్యధిక దేవాలయాలు కలిగి ఉన్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 6 వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 47000 దేవాలయాలు ఉన్నాయి. గుజరాత్ : భారత దేశంలో అత్యధిక దేవాలయాలు ఉన్న రాష్ట్రాలలో గుజరాత్ 5వ స్థానంలో ఉంది. ఇక్కడ 50000 దేవాల యాలు ఉన్నాయి. పశ్చిమబెంగాల్ : భారతదేశంలో అత్యధిక దేవాలయాలు కలిగి ఉన్న రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ 4 వ స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో మొత్తం 53500 దేవాలయాలు ఉన్నాయి. కర్ణాటక : మన దేశంలో అత్యధిక దేవాలయాలు కలిగిన రాష్ట్రాలలో కర్ణాటక 3 కే స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో మొత్తం 61000 వేల దేవాలయాలు



ఉన్నాయి. మహారాష్ట్ర : మన దేశంలో అత్యధిక దేవాలయాలు కలిగి ఉన్న రాష్ట్రాలలో మహారాష్ట్ర 2వ స్థానంలో ఉంది. ఇక్కడ దాదాపు 77000 దేవాలయాలు ఉన్నాయి. తమిళనాడు : భారత దేశంలో అత్యధిక సంఖ్యలో దేవాలయాలు ఉన్న రాష్ట్రాలలో తమిళ నాడు మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ దాదాపు 79000 దేవాలయాలు ఉన్నాయి.మన దేశంలో అత్యధిక దేవాలయాలు కలిగిన టాప్ 7 రాష్ట్రాలలో ఈ రాష్ట్రాలు ఉన్నాయి.

## సూపర్ హిట్ జోడి...



అమరావతి: ఒకరేమో సీఎం.. మరొకరేమో డిప్యూటీ సీఎం.. వారిద్దరి లక్ష్యం ప్రజాసంక్షేమ పాలన సాగించడమే. అయితే ఒకరిది సుధీర్ఘ రాజకీయ చరిత్ర.. మరొకరిది అందుకు భిన్నమైనా ఊహించని రీతిలో రాజకీయ రంగప్రవేశం చేసి, సక్సెస్ అయ్యారు. అంతవరకు ఓకే కానీ.. అనతి కాలంలోనే డిప్యూటీ సీఎంగా ప్రజల మన్ననలు పొందడమే కాక, ఏకంగా పల్లెలనుఅభివృద్ధి బాటలో పయనింపజేసేందుకు భారీ ప్రణాళిక రూపొందించారు ఆయన. అందుకు సీఎంగా సుధీర్ఘ అనుభవం గల ఆ నేత.. తన ప్రభుత్వంలో భాగమైన డిప్యూటీ సీఎంకు అభినందనలు తెలిపారు. ఇంతకు అభినందించిన సీఎం చంద్రబాబు అయితే..అభినందనలు అందుకున్న వారు ఎవరో మళ్లీ ప్రత్యేకంగా చెప్పాలా.. ఆయనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక.. పాలనా పరమైన అంశాలపై డిప్యూటీ సీఎం పవన్ అనతికాలంలోనే పట్టు సాధించారు. అంతేకాదు తనకు అప్పగించిన అటవీ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై పూర్తి అవగాహనతో అడుగులు వేస్తున్నారు పవన్. అందుకే కాబోలు తొలుత విస్తృత సమావేశాలు నిర్వహించి, తన శాఖల స్థితిగతులు అన్నీ తెలుసుకున్నారు. ఇక మంత్రిగా రంగంలోకి దిగిన తొలిసారే.. రాష్ట్రవ్యాప్త పల్లెపండుగకు పవన్ పిలుపునిచ్చారు. ఈనెల 14 నుండి 20వతేదీ వరకు అన్ని పంచాయతీలలో పంచాయతీ వారోత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు.పండుగ అంటే మామూలు పండుగ కాదు వేల కోట్ల రూపాయలతో గ్రామాల అభివృద్ధి బాటకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పల్లె పండుగ అన్ని గ్రామాలలో విజయవంతంగా సాగుతోంది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 13,326 గ్రామాలలో మొత్తం 30 వేల పనులు చేపట్టాలనే బృహత్ సంకల్పంతో రూ.4,500 కోట్లు ఖర్చు చేసి.. పల్లెలకు వెలుగులు నింపనున్నారు. అంతేకాదు జాబ్ కార్డు ఉన్న ఏ ఉపాధి హామీ కూలీ కూడా ఖాళీగా ఉండరాదన్నది కూడా పవన్ లక్ష్యం. అందుకే గ్రామసభలు నిర్వహిస్తూ.. ఎక్కడికక్కడ అభివృద్ధి ప్రణాళికలు కూడా సిద్దం చేస్తున్నారు అధికారులు. ఇలా పవన్ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా పల్లె పండుగ విజయవంతంగా సాగుతోంది. అంతే ప్రజా స్పందన కూడా వస్తోంది. అందుకే కాబోలు సుధీర్ఘ రాజకీయ చరిత్ర గల సీఎం చంద్రబాబు తాజాగా ప్రకటన విడుదల చేశారు. పవన్ ను అభినందిస్తూ.. రానున్న రోజుల్లో ఇలాంటి మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పల్లెల్లో సంతోషాలు నింపేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పేందుకు చాలా సంతోషిస్తున్నానంటూ చంద్రబాబు ప్రకటించారు. అయితే పవన్ మాత్రం తన సినిమా డైలాగ్ మాదిరిగా.. తగ్గేదెలే అంటూ తనదైన స్టైల్ లో పాలనా అంశాలపై దృష్టి సారించి దూసుకుపోతున్నారు.

## సత్యనిష్ఠే.. ఏకైక మార్గం



'భావనమే' జీవనం. జీవ దేహం కేవలం ఒక ఉపకరణం. ఇంద్రియ గ్రహణం, ప్రజ్ఞ, ఉద్వేగాలు, అభ్యాసం, అస్తిత్వరూపం, నిర్ణయాలు, పట్టుదల, అనుభూతి విస్తృతి.. అన్నీ భావప్రపంచమే. అయితే .. ఈ భావప్రపంచం సత్య, శాంత, స్పష్ట సమర్థతతో, సుసంస్కారంతో సాగాలంటే.. శరీరం సంతులిత సమర్థతతో పనిచేస్తూ ఆరోగ్యంగా ఉండటం అత్యవసరం. కానీ, తగినంత ఆరోగ్యంగా ఉన్నవారిలో కూడా చాలావరకు భావప్రపంచం సమర్థతతో పనిచేయకపోవడం కీలకమైన సమస్య. అందులోనూ అధికారం, ధనం, విద్య (మేధస్సు) ఉన్నవారిలో ఈ దోషం ఉండటం సమాజానికి ప్రబలమైన సమస్య. భావప్రపంచాన్ని సంస్కారబలంతో నడుపగలిగింది సదా 'సత్యనిష్ఠ'. సత్యజీవనం.. విద్య. అసత్య జీవనం.. అవిద్య. దైనందిన మానవ జీవనం సత్యాసత్యాల 'మిశ్రమం'. 'సమానతా భావమయమైన' సరళజీవనం, సమష్టి శాంతి, నిర్భయత, ఆరోగ్యం, కృషి, పరస్పర ఆదరణ, ఆధ్యాత్మిక సాధన, సంతృప్తి, ఆనందానుభవం ఇవన్నీ అనివార్యంగా సత్యాన్ని ఆశ్రయించి సాగుతుంటాయి. 'ఆధిక్యతాభావమయమైన' సంపద్గత జీవనం, కాంక్ష , ప్రకృతిశోషణ, ఘర్షణ, హననం, ఆక్రమణ, ప్రాణనష్టం, భయం ఇవి అసత్యాన్ని ఆశ్రయించి సాగుతాయి. మానవ 'జీవితాన్ని శాసించవలసిన సత్యాలు ఇవి.. 'యద్దృశ్యం తన్నశ్యం'- కనిపించే 'పదార్థజగత్తు' ఏ మినహాయింపు లేకుండా%ొ% ఎప్పటికైనా కాలం మింగేసేదే. లోకంలో అందరూ మరణించినట్లే నేనూ పోతానుబీ నేను నా పూర్వీకులను గుర్తుచేసుకోనట్లే, తరువాతి కాలంలో నన్ను ఎవరూ తలచుకోరు.. అన్న బలమైన స్పృహతో సహజంగా జీవించడం. నేను, నా గొప్పతనం ఎంతోమంది సహాయ సహకారాల వల్ల రూపుదిద్దుకున్నదే కానీ, కేవలం నా కృషివల్ల కాదు అన్న ఎరుక కలిగి కృతజ్ఞతతో జీవించడం. ఎన్ని గొప్పపనులు చేసినా.. దైవం (ప్రకృతి) ప్రసాదించిన విశిష్టతతో తాను నిర్వహించిన ధర్మంగానే భావిస్తూ.. సామాన్యులతో తాదాత్మ్యత వదులుకోకుండా ఉండటం. పంచభూతాలు మానవ సృష్టికాదు కాబట్టి.. ఏ వ్యక్తులకూ వాటిపై సొంత ఆస్తిగా వాడుకునే హక్కు ఉండని వ్యవస్థను ఏర్పాటు చేసుకునే నిష్ఠ కలిగి ఉండటం. ఏ సమాజాలకు సాంస్కృతికమైన ఏ విశిష్టతలు ఉన్నా మౌలిక స్థాయిలో అహింస, ఆత్మీయత అందరికీ ఉండి తీరవలసిందన్న స్పృహ కలిగి ఉండటం. ఎవరి మత విశ్వాసాలూ, దైవాలూ, ఆచారాలూ, లోకాలూ వారికున్నా అందరి 'మౌలిక చైతన్యం' ఒక్కటే అన్న స్పృహతో పరస్పర నిర్ద్వేషంతో, ఆదరణతో జీవించాలన్న నిశ్చయబలం. ఈ సత్యనిష్ఠే లోక శ్రేయస్సుకు ఎప్పటికైనా ఆధారం, ఏకైకమార్గం! వదలి చేసే ఇతర ప్రయత్నాలు.. కేవలం గాలిమేడలే!

## 35 శాతమే వేతన పెంపు

బోయింగ్ కంపెనీ ప్రతిపాదనకు కార్మికుల తిరస్కారం రెంటాన్ (వాషింగ్టన్) : వేతనాల పెంపుపై బోయింగ్ కంపెనీ తాజాగా చేసిన ప్రతిపాదనలను ఫ్యాక్టరీ కార్మికులు వ్యతిరేకించారు.తమ ధర్నాను కొనసాగించారు. వేతనాల పెంపు కోరుతూ గత ఆరు వారాలుగా కార్మికులు కొనసాగుతున్న సమ్మె కారణంగా బోయింగ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి నిలిచిపోయింది. కంపెనీ యాజమాన్యం ఇచ్చిన కాంట్రాక్ట్ ఆఫర్పై బుధవారం ఓటింగ్ జరిగిందని, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ మెషినిస్ట్స్ అండ్ ఏరోస్పేస్ వర్కర్స్ సభ్యులు 64శాతం మంది దీన్ని వ్యతిరేకించారని స్థానిక యూనియన్ నేతలు తెలిపారు. ఏటికేడాది కంపెనీ కార్మికులను మోసం చేస్తూ సరిగా వ్యవహరించనప్పుడు అందుకు తగిన పర్యవసానాలు వుంటాయన్నది సుస్పష్టమని, ఇందుకు సాక్ష్యాలు కూడా వున్నాయని ఐఎఎం డిస్ట్రిక్ట్ 751 యూనియన్ అధ్యక్షుడు జాన్ హోల్డెన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంపెనీ ఈ ఓటింగ్పై వెంటనే ఎలాంటి వ్యాఖ్య చేయలేదు.జనవరిలో అలాస్కా ఎయిర్లైన్స్ విమానం తలుపు ఊడిపోయిన నేపథ్యంలో పలు సంస్థల దర్యాప్తులను ఎదుర్కొంటున్న బోయింగ్కు ఇదొక సవాళ్ల సంవత్సరంగా మారింది. అటువంటి పరిస్థితుల్లో సెప్టెంబరు 13న ఈ వివాదం




రేగింది. ఈ సమ్మె కారణంగా కంపెనీకి నగదు అందుబాటులో లేకుండా పోయింది. నాలుగేళ్ల కాలంలో 35శాతం వేతనాలు పెంచుతామన్నది కంపెనీ ఇచ్చిన తాజా ఆఫర్. తొలుత కంపెనీ ఇచ్చిన ఆఫర్ 25శాతం పెంపు కావడంతో కార్మికులు సమ్మె చేపట్టారు. ఆరు వారాల సమ్మె నేపథ్యంలో కంపెనీ తాజాగా 35శాతానికి పెంచింది. దాన్ని కార్మికులు తిరస్కరించారు. మూడేళ్ల కాలంలో 40శాతం వేతనాలను పెంచాలని యూనియన్ డిమాండ్ చేస్తోంది.

## కాలుష్య కోరల్లో 'యమున'

ఒకప్పుడు యయునా నదీ జలాలు స్వచ్ఛంగా వుండేవి. ఇప్పుడు యమునా జలాలంటే కాలుష్యానికి ఆలవాలం. జనాభా పెరగడం, స్వాతంత్ర్యానంతరం నదీ తీరాన పారిశ్రామికీకరణ విపరీతంగా జరగడంతో నది కాలుష్యం కాలక్రమేణా పెరుగుతూ వచ్చింది. మానవ, పారిశ్రామిక వ్యర్థాలన్నీ నదిలోకి చేరి కాలుష్యానికి యమునా నది కేరాఫ్ అడ్రస్గా మారింది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీ సమీపంలో యమునా నది మురుగు కాల్వను తలపిస్తుంటుంది. పారిశ్రామిక వ్యర్థాల కారణంగా నది నురగలు తేలుతూ దర్శనమిస్తోంది. ఢిల్లీ సమీపంలో ప్రవహించే ఈ నదినీటిని నేరుగా తాగడం, పంటలకు వాడటం ప్రమాదకరమని నిపుణుల పరిశీలనలో తేలింది. ఈ నీళ్లు తాగడానికి కాదు గదా కనీసం స్నానానికి కూడా పనికి రావని, మానవ వ్యర్థాలు సాధారణ స్థితి కంటే 500 రెట్లు అధికంగా ఉన్నాయని ఢిల్లీ పొల్యూషన్ కంట్రోల్ కమిటీ ప్రభుత్వానికి నివేదికలో తెలియజేసినప్పటకీ వీటిని కాలుష్య కారకాల బారిన పడకుండా రక్షించడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. ఢిల్లీ నగరానికి అవసరమైన తాగునీటిలో సగం వాటాను అందించే యమునా నది, దేశంలోనే అత్యంత కాలుష్యపూరిత నదుల్లో ముందు వరసలో ఉంది. ఈ కాలుష్యంలో 70 నుంచి 80 శాతం ఢిల్లీ సమీపంలో ఈ నది



ప్రవహించే 22 కిలోమీటర్ల పరిధిలోనే చేరుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. యమునా నదీ జలాలను శుద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా 'యమునా యాక్షన్ ప్లాన్' పేరుతో 1992 నుంచి ప్రణాళికలు రూపొందించినా కాలుష్యంలో ఫలితం కనిపించడం లేదు. దేశ రాజధాని ప్రజల నీటి అవసరాలను, ఆరోగ్యాన్ని, అలాగే పర్యాటక ప్రాభవాన్ని దృష్టిలో ఉంచుకుని యమునా నది ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.


## యూట్యూబర్లకు అదిరిపోయే న్యూస్.. ఆదాయం పెరిగేలా కొత్త ఫీచర్



ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్‌కు ఉన్న ఆదరణ ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పాల్సిందే. ప్రపంచవ్యాప్తంగా ఈ యాప్‌కు విపరీతమైన క్రేజ్ ఉంది. యూట్యూబ్ ద్వారా ఎంతో మంది తమ ట్యాలెంట్‌ను ప్రపంచాన్ని చాటుకుంటున్నారు. అంతేనా భారీగా ఆదాయం సైతం ఆర్జిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా క్రియేటర్ల కోసం కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది యూట్యూబ్. క్రియేటర్లకు ఆదాయం పెంచడమే లక్ష్యంగా ఈ కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చారు. షాపింగ్ అఫ్లియేట్ ప్రోగ్రామ్ పేరుతో యూట్యూబ్ కొత్త ఫీచర్‌ను పరిచయం చేసింది. ఈ ఫీచర్ సహాయంతో ర్హులైన క్రియేటర్లు తన వీడియోల్లో ఉత్పత్తులను ట్యాగ్ చేసి ఆదాయాన్ని సంపాదించుకోవచ్చు. కాగా ఈ ఫీచర్ ఇప్పటికే దక్షిణ కొరియా, అమెరికా లాంటి దేశాల్లో అందేబాటులోకి రాగా.. ఈ సేవల్ని తాజాగా మరిన్న దేశాలకు విసర్తించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా యూట్యూట్ తాజాగా ఈ సేవలను భారత్లోనూ లాంచ్ చేసింది. ఇందుకోసం గాను మింత్రా, ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. అర్హులైన కంటెట్ క్రియేటర్లందరికీ ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు యూట్యూబ్ తెలిపింది. ఈ ఫీచర్‌ను పొందాలంటే క్రియేటర్లు ముందుగా యూట్యూబ్ షాపింగ్‌లో సైనప్ అవ్వాల్సి ఉంటుంది. మీ దరఖాస్తును యూట్యూబ్ అమోదం తెలిపిన తర్వాత ఈ సదుపాయాన్ని యాక్సెస్ చేసుకోవచ్చు. దీంతో యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసే వీడియోలు, షార్ట్‌లు, లైవ్‌స్ట్రీమ్‌లో ఉత్పత్తులను ట్యాగ్ చేయొచ్చు. యూజర్లకు ఆ ఉత్పత్తులు నచ్చితే పక్కనే ఉన్న షాపింగ్ సింబల్‌పై క్లిక్ ఆప్రొడక్ట్ వివరాలు కనిపిస్తాయి. దీనికోసం వేరే బ్రౌజర్ పేజ్‌కు కూడా వెళ్లాల్సిన పనిలేదు. అక్కడే ఉత్పత్తి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నమాట. ఈ సేవల్ని తాజాగా మరిన్న దేశాలకు విసర్తించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా యూట్యూట్ తాజాగా ఈసేవలను భారత్లోనూ లాంచ్ చేసింది. ఇందుకోసం గాను మింత్రా, ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. అర్హులైన కంటెట్ క్రియేటర్లందరికీ ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు యూట్యూబ్ తెలిపింది.అంతేకాదు నచ్చిన ప్రొడక్ట్‌ని అక్కడే పిన్ చేసుకునే అవకాశం కూడా కల్పించారు. ఇలా యూట్యూబర్స్ ప్రమోట్ చేసిన ఉత్పత్తులను యూజర్లు కొనుగోలు చేస్తే క్రియేటర్లకు కమీషన్ లభిస్తుంది. ఒక వీడియోలో సుమారు 30 ప్రొడక్ట్స్‌ను ట్యాగ్ చేసుకోవచ్చు. ట్యాగ్ చేసే ముందే మీకు వచ్చే కమిషన్ వివరాలను తెలుసుకోవచ్చు. 10 వేల మంది కంటే ఎక్కువ సబ్‌స్క్రైబర్లు ఉన్న వారికి ఈ అవకాశం ఉంటుంది. చిన్నారుల కోసం నడుపుతోన్న ఛానల్స్, మ్యూజిక్ ఛానల్స్‌కు ఈ సదుపాయం అందు బాటులో ఉండదు. యూట్యూబ్ తీసుకొచ్చిన ఈ కొత్త ఫీచర్ సహాయం తో యూట్యూబర్ల ఆదాయం భారీగా పెరగడం ఖాయంగా కనిపిస్తోంది.

## నైట్రోజన్ గ్యాస్, కంప్రెస్డ్ ఎయిర్.. కారు టైర్లలో ఏది నింపడం మంచిది..?

వీకెండ్ కలిసి వస్తున్న క్రమంలో చాలా మంది హాలిడే ట్రిప్‌కి ప్లాన్ చేస్తున్నారు. ఇందుకోసం ముందుగానే వాహనాలను రెడీ చేసుకోవాల్సి ఉంటుంది. లాంగ్ జర్నీలో ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఇంజిన్ పనితీరు, టైర్ల స్టేటస్ వెరిఫై చేసుకోవాలి. అయితే, దూర ప్రయాణాల్లో కొన్నిసార్లు టైర్లు పగిలిపోతుంటాయి. టైరులో ఎయిర్ ప్రెజర్ పెరిగితే బరస్ట్ అవుతుంది. దీంతో పెద్ద ప్రమాదాలు జరగవచ్చు. ఇంతకీ టైర్లలో నైట్రోజన్ గ్యాస్ ఫిల్ చేయించాలా? లేక కంప్రెస్డ్ ఎయిర్‌తో నింపాలా? అనే కన్ఫూజన్ చాలామందిలో ఉంటుంది. మీకు కూడా ఈ డౌట్ ఉందా? దీనికి సరైన సమాధానం చూద్దాం. టైర్లలో నైట్రోజన్ గ్యాస్ ఫిల్ చేయిస్తే బాగుంటుందని నిపుణులు సూచిస్తుంటారు. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి. ముఖ్యంగా, ప్రెజర్ రిటెన్షన్ బాగుంటుంది. అంటే, టైర్ల నుంచి నైట్రోజన్ గ్యాస్ త్వరగా దిగిపోదు. ఎక్కువ సేపు నిల్వ ఉండి టైర్ ప్రెజర్‌ను అలాగే కాపాడుతుంది. దీంతోపాటు టైర్ లైఫ్ కూడా ఎక్కువ కాలం వస్తుంది. నైట్రోజన్ గ్యాస్‌లో తేమ ఉండదు. దీంతో టైరు లోపల రస్ట్ రావడం తగ్గిపోతుంది. రబ్బర్ నాణ్యత కూడా త్వరగా పడిపోదు. లాంగ్ జర్నీ చేసేటప్పుడు టైర్లు పగలడానికి ముఖ్య కారణం.. టైర్లు అతిగా వేడెక్కడం. టైర్ ఉష్ణోగ్రత పెరిగితే బరస్ట్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. కానీ, నైట్రోజన్ గ్యాస్ టైర్ ఉష్ణోగ్రతను పెరగనివ్వదు. టైరులో ఎక్కువ సేపు ప్రెజర్ నిల్వ ఉంటుంది కాబట్టి, రోలింగ్ రెసిస్టెన్స్ తగ్గుతుంది. అంటే, కారు సులువుగా కదిలి ఫ్యుయల్ ఎఫిషియన్సీ పెరిగి మైలేజీ కూడా ఎక్కువ ఇస్తుంది. అయితే, నైట్రోజన్ గ్యాస్ లభ్యత తక్కువగా ఉంటుంది. ప్రతి పెట్రోల్ పంప్ లేదా గ్యారేజ్‌లలో కంప్రెస్డ్ ఎయిర్ అందుబాటులో ఉంటుంది. ఈ ఆర్డినరీ ఎయిర్ ఫిల్లింగ్ చేయించడం చాలా సులభం. పైగా, ధర కూడా తక్కువే. అయితే, నైట్రోజన్ గ్యాస్ మాదిరిగా ఈ కంప్రెస్డ్ ఎయిర్ ఎక్కువ సేపు టైర్లలో నిల్వ ఉండలేదు.



టైరు నుంచి త్వరగా దిగిపోతుంది. దీంతో తరచూ టైర్లలో ఎయిర్ ఫిల్ చేసుకోవాల్సి ఉంటుంది. కంప్రెస్డ్ ఎయిర్ తేమగా ఉంటుంది. ఇది రిమ్ము రస్ట్ పెరగడానికి కారణమై టైరు నాణ్యతను దెబ్బతీస్తుంది. ఇందులో తేమ ఉండటం వల్ల వాతావరణం మారితే టైరులో గాలి త్వరగా దిగిపోతుంది. లాంగ్ జర్నీలో లేదా హైవేలపై ట్రావెల్ చేసేటప్పుడు టైర్లలో ఆర్డినరీ ఎయిర్ ఉంటే ఓవర్‌హీట్ అయ్యే అవకాశం ఉంటుంది. ఫలితంగా, టైరు త్వరగా పాడై బరస్ట్ అవుతుంది. పరిస్థితులను బట్టి టైర్లను ఏదో ఒక గ్యాస్‌తో ఫిల్ చేయించుకోవాలి. మీరు లాంగ్ జర్నీకి ప్లాన్ చేస్తుంటే ఎక్కువ దూరం పాటు వేగంగా వాహనాన్ని నడుపుతారు, కాబట్టి నైట్రోజన్ గ్యాస్‌ని ఫిల్ చేయించుకోవడం బెటర్. ఇది టైరు ప్రెజర్‌ను, ఉష్ణోగ్రతను కంట్రోల్‌లో ఉంచుతుంది. మీకు కూడా సేఫ్టీతో పాటు టైరు ఎక్కువ కాలం మన్నికనిస్తుంది. అయితే, నైట్రోజన్ గ్యాస్ అందుబాటులో లేనప్పుడు కంప్రెస్డ్ గ్యాస్ ఫిల్ చేయించుకోవచ్చు. ఇదేమీ ప్రమాదకరం కాదు. కాకపోతే ఎప్పటికప్పుడు టైర్ ప్రెజర్ చెక్ చేసుకోవాలి.

## అమరావతి 2 హైదరాబాద్.. 4 అవర్స్

# కీలక రైల్వే ప్రాజెక్టుకు ఆమోదం..!



**విజయవాడ,తెలంగాణ దిశ:** ఏపీ విషయంలో కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకుంటోం ది. గతానికి భిన్నంగా తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోంది. రాష్ట్ర విభజన సమయంలో పెండింగ్లో ఉన్న అంశాలకు పరిష్కార మార్గం చూపుతోంది. అందులో భాగంగా ఢిల్లీ కేంద్రంగా కీలక నిర్ణయాలకు రూపకల్పన జరుగుతోంది. తాజాగా ఏపీ రాజధాని అమరావతి నుంచి తెలంగాణ రాజధాని హైదరాబాద్ వరకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవేకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు అందుబా టులోకి వస్తే రెండు రాష్ట్రాల మధ్య ప్రయాణ దూరం తగ్గనుంది. దాదాపు నాలుగు గంటల వ్యవధిలోనే గమ్యానికి చేరుకునే అవకాశం ఉంది. రాష్ట్ర విభజన జరిగి దాదాపు 11 సంవత్సరాలు అవుతోంది. గతంలో ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చాలా రకాల విభజన సమస్యలకు పరిష్కారం దొరకలేదు. వాటన్నింటికీ ఇప్పుడు మోక్షం కల్పిస్తోంది ఎన్డీఏ ప్రభుత్వం..రాష్ట్ర విభజనసమయంలో చాలా రకాల అంశాలు తెరపైకి వచ్చాయి. ప్రధానంగా రవాణాకు సంబంధించి ప్రాజెక్టులు మంజూరుకు నిర్ణయించారు. కానీ వాటి విషయంలో ఎటువంటి కదలిక లేకపోయింది. అయితే ఇప్పుడు అమరావతి– హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే కి పచ్చ జెండా ఊపింది కేంద్రం. ఈ మేరకు డిపిఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని హోం శాఖను ఆదేశించింది. అదేవిధంగా త్వరలో అమరావతి రింగ్ రోడ్డు ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది. మరోవైపు తెలంగాణలో ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి అనుమతుల ప్రక్రియ మొదలైంది. బిపిఆర్ కార్యరూపం దాల్చితే.. రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య ప్రయాణం కేవలం నాలుగు గంటలు మాత్రమే.అమరావతి రాజధాని విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటూ వస్తోంది. ఇప్పటికే బడ్జెట్లో 15 వేల కోట్ల రూపాయలను కేటాయించింది. మరోవైపు రోడ్డు కం రైల్వే ప్రాజెక్టులకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇస్తూ వస్తోంది. ముఖ్యంగా రాజధానిని అనుసంధానం చేస్తూ రైల్వే ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది కేంద్రం. మరోవైపు ఏపీలో మరో రిఫైనరీ ఏర్పాటును పరిశీలించాలని పెట్రోలియం శాఖను కేంద్రం ఆదేశించింది. విశాఖ, విజయవాడ, హైదరాబాద్, కర్నూలు క్యారిడార్ల ఏర్పాటును రైల్వే శాఖ పరిశీలించనుంది. పలు సమస్యల పరిష్కారానికి పలు శాఖలకు హోం శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే పెట్రోలియం రంగంలో అవకాశాలు వినియోగించుకోవడంలో ఏపీ ముందంజలో ఉందని కేంద్రం చెబుతోంది.. గతంలో రెండు సార్లు ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. 2014లో తొలిసారిగా ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి రాగా.. టిడిపి కీలక భాగస్వామిగా ఉంది. ఏపీలో అధికారంలో ఉంది కూడా. అయితే రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అప్పట్లో కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. 2019లో మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చారు. అయితే అప్పట్లో జగన్ ఏపీలో అధికారంలోకి రాగలిగారు. అప్పుడు కూడా రాష్ట్రానికి కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు టిడిపి సహకారంతో మూడోసారి అధికారంలోకి వచ్చింది ఎన్డీఏ. ఏపీకి ఎనలేని ప్రాధాన్యం ఇస్తుండడం ఇప్పుడు విశేషం. ఏపీ, తమిళనాడు మధ్య ముఖ్యమైన రైల్వేలైన్కు సంబంధించి కీలక ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రూ. 1,332 కోట్లతో తిరుపతి?పాకాల?కాట్పాడి రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుకు ఓకే చెప్పింది. రాయలసీమలో ముఖ్యంగా తిరుపతి నుంచి పాకాల చాలా ముఖ్యమైన రైల్వే లైన్గా మారిపోయింది. ఇప్పటికీ అక్కడ సింగిల్ లైన్ ట్రాక్ మాత్రమే ఉ ండడంతో రవాణాపరంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు. అలాగే ఎక్కువ రైళ్లను నడపడానికి కూడా సింగిల్ ట్రాక్ అనేది ఇబ్బందికరంగా మారింది. అలాగే పాకాల నుంచి కాట్పాడి వెళ్లే లైన్ పరిస్థితి అంతే. ప్రజారవాణా మాత్రమే కాకుండా సరుకు రవాణాకు కూడా ఇది చాలా ముఖ్యమైన లైన్. ఇప్పుడు తిరుపతి నుంచి పాకాల మీదుగా కాట్పాడి వరకు రైల్వే లైన్ డబ్బింగ్ చేయబోతున్నారు. దీనితో ఆ మార్గంలో రైల్వే రవాణాకు సంబంధించిన కష్టాలు తీరబోతున్నాయితిరుపతి నుంచి కాట్పాడి వరకూ డబ్లింగ్ పనులకు ఆమోదం తెలపడంతో ప్రధానమంత్రి మోదీ, రైల్వే మంత్రి వైష్ణవ్కు కృతజ్ఞతలు తెలిపారు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు. టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహిస్తూ, రైలు–రోడ్డు కనెక్టివిటీ మెరుగుపరిచేందుకు కేంద్రప్రభుత్వం కీలక అడుగు వేసిందనీ తిరుపతి?పాకాల?కాట్పాడి రైల్వే లైన్ను డబుల్ ట్రాక్గా అభివృద్ధి చేసేందుకు రూ. 1,332 కోట్లతో ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపడం చాలా సంతోషాన్ని కలిగించిందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారుఈ లైన్ డబ్లింగ్ వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి తిరుపతికి వచ్చే భక్తులకు ప్రయాణం మరింత వేగవంతం, సౌకర్యవంతం కానుందని చెప్పిన మంత్రి అభిప్రాయపడ్డారు. విద్యా, వైద్య అవసరాల కోసం వెల్లూరుకు వెళ్లే ప్రయాణికులకు కూడా గొప్ప వరం కానుందని అన్నారు.ఏడాదికి 4మిలియన్ టన్నుల వరకూ సరుకు రవాణా చేయడా నికి ఈ రైల్వే ప్రాజెక్ట్ తోడ్పడనుంది. రాష్ట్రంలోని ఎలక్ట్రానిక్ సిమెంట్, స్టీల్ రంగాలకు మరింత చేయూతనివ్వబోతుందని పారిశ్రా మిక వర్గాలు చెబుతున్నాయి. పనులు వేగం పుంచుకుంటాయని, స్థానికం గా ఉ పాధి అవకాశాలు పెరుగుతాయని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది.

## రోజా సీక్రెట్ మీటింగ్ పై రచ్చ..!

# రెండు పార్టీల్లోనూ ప్రచారం..?



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ఆర్కే రోజా. మాజీ మంత్రి. వైసీపీ మౌత్ ఫీస్. పాలిటిక్స్లోనూ ఖబర్దస్త్ కామెడీ చేస్తుంటారు. గతంలో వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాజకీయమంతా రోజా చుట్టూనే తిరిగింది. అసెంబ్లీలోనూ ఓవరాక్షన్ చేశారు. ఆనాటి స్పీకర్ కోడల.. ఆమెను ఏడాదికిపైగా సభ నుంచి సస్పెండ్ చేశారు. ఫైర్ బ్రాండ్ లీడర్గా ఆరోజుల్లో ఓ వెలుగు వెలిగారు. కానీ,ఈసారి మాత్రం సీన్ మారింది. దారుణ పరాజయంతో ఇంటికే పరిమితమవుతున్నారు. రాజకీయాల్లో యాక్టివ్గా లేరు. మీడియా ముందుకూ రావట్లేదు. ఆమెను టన్నుల్లో భయం వెంటాడుతోందని అంటున్నారు.అరెస్టుల లిస్టులో బోరుగడ్డ, పోసాని, వల్లభనేనిల తర్వాత.. పెద్దిరెడ్డి, కొడాలి, పేర్ని, అంబటి, రోజాల పేర్లే వినిపిస్తున్నాయి. కొడాలి హాస్పిటల్లో ఉండటంతో ప్రస్తుతానికి కాస్త రిలాక్స్. పేర్నికి ఆల్రెడీ ఉచ్చు బిగిసింది. పెద్దిరెడ్డి, అంబటి, రోజాల కోసం వేట మొదలైంది. ఇదే ఇప్పుడు రోజమ్మను టెన్షన్కు గురి చేస్తోందని అంటు న్నారు. తన అరెస్ట్ పక్కా అని ఫిక్స్ అవడంతో.. ఆకులు పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. టీడీపీలో ఉన్న పాత పరిచయాలను కొత్తగా వాడేసుకుంటున్నారట. చంద్రబాబు కేబినెట్లో కీలక పోస్టులో ఉన్న ఓ మంత్రితో ఇటీవల రోజా రహస్యంగా సమావేశమయ్యారని తెలుస్తోం ది. రాయలసీమకు చెందిన ఆ మంత్రిని రోజా విజయవాడలో కలిశా రట. ఇదే అంశం ఇప్పుడు ఇటు టీడీపీలో, అటు వైసీపీలో కలకలం రేపుతోంది. రోజా మంత్రిగాఉన్నప్పుడు ఆడుదాం ఆంధ్ర పేరుతో అక్రమాలకు పాల్పడ్డార నే ఆరోపణలు ఉన్నాయి. ఆడుదాం ఆంధ్రపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని మంత్రి రాంప్రసాద్ ప్రకటించా రు. పక్కా ఆధారాలు ఉన్నాయరేపో, మాపో ఆర్కే రోజా అరెస్టంటూ ప్రచారమూ జరుగుతో ంది. ఇలాంటి టైమ్లో ఓమంత్రితో రోజా సీక్రెట్ మీటింగ్ అందుకోస మేనా?విచారణ నుంచి తప్పించుకో వడానికేనా? ఆమంత్రితో లాబీయ ంగ్ చేస్తున్నారా? అందుకు చంద్రబాబు, ఉన్న రోజాను.. ఆ మంత్రి ఎందుకు కలిశారంటూ టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేష్, పవన్లపై రోజా చేసిన కామెంట్స్ గుర్తులేవా? అప్పుడే మర్చిపోయారా? ఆమెతో భేటీ కావాల్సి న అవసరం ఏముంది? అంటూ మండిపడుతు న్నారు. మేటర్ చంద్ర బాబు దృష్టికి కూడా వెళ్లిందని.. ఆయన సైతం వాళ్ల భేటీపై సీరియస్గా ఉన్నారని తెలుస్తోంది. త్వరలోనే ఆ మంత్రిని పిలిపించి మందలించే ఛాన్సెస్ ఉన్నాయని అంటున్నారుటీడీపీలోనే కాదు..అటు వైసీపీ నేతలు కూడారోజా తీరుపై ఫైర్ అవుతున్నారు. ఓవైపుఅధికార పార్టీపై తమ అధినేతతీవ్రంగా పోరాడుతుంటే.. ఆ మంత్రితో రోజా రహస్య సమావే శాలుఏంటని ప్రశ్నిస్తున్నారు. మిగతా మాజీ మంత్రులు తమపై నమోదవుతున్న కేసులపై పోరాడుతుంటే.. రోజా మాత్రం ఇలా సరెండర్ కావడం పార్టీకి తలవొంపులని మండిప డుతున్నారు. ఎవరు ఏమనుకుం టున్నా.. రోజా మాత్రం కేసుల నుంచి ఎలాగైనా బయటపడాలని గట్టిగా ఫిక్స్అయినట్టు తెలుస్తోంది.అక్రమ కేసులకు భయపడబోమని ప్రెస్మీ ట్లలో మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూనే? మరోవైపు తన రాజకీయ అనుభవమంతా ఉపయోగి ంచి.. రహస్య మంత్రాంగంతో ఎలాగైనా చిక్కుల్లో చిక్కుకోకుండా తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

# సత్యవేడు పంచాయితీ తీరేదెన్నడూ...?




**తిరుపతి,తెలంగాణ దిశ:** చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గ టీడీపీ పంచాయితీ ఇప్పట్లో తేలేలా కనిపించడంలేదు. గతంలో వీడియోలతో అడ్డంగా బుక్ అయిన టిడిపి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలంపై పార్టీ అధిష్టానం బహిష్కరణ వేటు వేయడంతో?అక్కడ పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా మారిందట. అయితే ఎమ్మెల్యే ఆదిమూలం మాత్రం ఇవాళో..రేపో తనపై విధించిన బహిష్కరణ వేటును ఎత్తివేస్తారనే ధీమాతో ఉన్నారట.అందుకే పార్టీ కార్యక్రమాల్లో తనకు తానుగా పాల్గొంటున్నారన్న చర్చ జరుగుతోంది. కానీ పార్టీ క్యాడర్లో మాత్రం తీవ్ర అయోమయం కొనసాగుతోందట. ఎమ్మెల్యే ఆదిమూలం నాయకత్వంలో పనిచేయాలో, వద్దో ఎటూ తేల్చుకోలేక పార్టీ కేడర్ సతమతమవుతోందన్న టాక్ విన్పిస్తోంది. సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ పంచాయితీ ఏంటో మీరే చూడండి.సీఎం చంద్రబాబు సొంత జిల్లాలోని సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి గందరగోళంగా మారింది. పదేళ్ల తర్వాత మొన్నటి ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. అయితే ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఓ మహిళతో వీడియోలో కనిపించి అడ్డంగా బుక్కయ్యారు. దీంతో నియోజకవర్గంలో వెంటనే దిద్దుబాటు చర్యలు ప్రారంభించిన టిడిపి అధిష్టానం..ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఆదిమూలాన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోందన్న టాక్ జిల్లా రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది.సత్యవేడు నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున ఆదిమూలం ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2024 ఎన్నికలకు ముందు ఆయనకు వైసిపి అధిష్టానం సత్యవేడు అసెంబ్లీ టికెట్ కాకుండా తిరుపతి ఎంపీ స్థానం కేటాయించడంతో ఆయన అలక బూనారు. తిరుపతి ఎంపీగా పోటీ చేయడం ఇష్టంలేక ఏకంగా పార్టీనే వదిలి టిడిపిలో చేరారు. టిడిపి నుంచి సత్యవేడు ఎమ్మెల్యేగా రెండోసారి గెలిచారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ వ్యవహారం తర్వాత సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. త్వరలోనే కొత్త ఇంచార్జిని నియమిస్తామని పార్టీ అధిష్టానం ప్రకటించినా?ఇప్పటివరకు అది కార్యరూపం రూపం దాల్చలేదు. దీంతో ఎవరి నాయకత్వంలో పనిచేయాలో తెలియక సత్యవేడు తెలుగు తమ్ముళ్లు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు .ఇదిలా ఉండే, పార్టీ వేటు తర్వాత కొద్దిరోజుల పాటు కేవలం ఇంటికే పరిమితం అయిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఇప్పుడు ఒక్కసారిగా యాక్టివ్ అయ్యారట. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు అడపాదడపా పార్టీ కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారట. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ జిల్లాకు వచ్చిన ప్రతిసారి ఎయిర్ పోర్టులో వారిని కలుస్తున్నారని తెలుగు తమ్ముళ్లలో టాక్ విన్పిస్తోంది. త్వరలోనే తనపై విధించిన బహిష్కరణ వేటు ఎత్తివేస్తారనే ధీమాతో ఉన్నారట.ఈ విషయంలో పార్టీ అధిష్టానంలో మాత్రం ఇంకా ఊగిసలాటే కనిపిస్తుందన్న వాదన విన్పిస్తోంది. ఎమ్మెల్యే ఆదిమూలంపై ఇంకా సస్పెన్షన్ వేటును కొనసాగిస్తూనే ఉంది. ఈ వ్యవహారం ఇలా ఉంటే సత్యవేడు టిడిపి నేతలు మాత్రం ఇదెక్కడి తలనొప్పి అంటూ తలలు పట్టుకుంటున్నారంట. పనుల కోసం ఎమ్మెల్యే వద్దకు వెళ్లాలా, వద్దా అని తేల్చుకోలేకపోతున్నారని సమాచారం. పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ను సైతం నియమించకపోవడంతో ఇక్కడ అంతా గందరగోళ వాతావరణమే కన్పిస్తోంది. ఎవరినో ఒకరిని ఇన్చార్జ్ గా అయినా వేయండి లేదా ఆదిమూలంపై సస్పెన్షన్ను ఎత్తివేయండి అంటూ సత్యవే డు తెలుగు తమ్ముళ్లు నిలదీస్తున్నారని సమాచారం.ఎమ్మెల్యే ఆదిమూలం పార్టీ నుంచి సస్పెండ్ కావడంతో బయట వ్యక్తుల అజమాయిషీ నియోజకవర్గంలో పెరిగిందని అక్కడి తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. గంగా ప్రసాద్ అనే సీనియర్ టిడిపి నేత పార్టీ తరపున నియోజకవర్గానికి పెద్దదిక్కుగా ఉంటున్నారట. ఆయన కనుసన్నల్లోనే సత్యవేడు నియోకజవర్గానికి సంబంధించిన పార్టీ వ్యవహారాలన్నీ కొనసాగుతున్నాయట.ఆయన ద్వారా నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి పదవి దక్కించుకునేందుకు చాలామంది స్థానిక నేతలు ఆయన వద్దకు క్యూ కడుతున్నారని తెలుస్తోంది. అయితే నియోజకవర్గంలోనూ గంగా ప్రసాద్ కు వ్యతిరేకవర్గం కూడా తయారైందట. మొన్నటి ఎన్నికల ముందు వరకు సత్యవేడు టిడిపి ఇంచార్జిగా కొనసాగిన మాజీ ఎమ్మెల్యే హేమలత సైతం ఇప్పుడు మళ్లీ ఇంచార్జి పదవిని ఆశిస్తున్నారన్న టాక్ నియోజకవర్గంలో కోడై కూస్తోందట. మొత్తం మీద సత్యవేడు నియోజకవర్గం విషయంలో ఆచితూచి వ్యవహరించాలని పార్టీ అధిష్టానం భావిస్తుండగా..లోకల్ కేడర్ మాత్రం ఈ తలనొప్పికి ఫుల్ స్టాప్ పడేదెప్పుడని ఎదురుచూస్తున్నారంట.

# రేషన్ బియ్యం అక్రమాలపై చర్యలేవీ..?




**హైదరాబాద్,తెలంగాణ దిశ:** పేదల ఆకలి తీర్చాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన రూపాయికే కిలో బియ్యం పథకం పందికొక్కుల పాలవుతోంది. ఇదంతా పెద్ద మాఫియాగా మారింది. బియ్యం మొత్తం విదేశాలకు తరలుతున్నాయి. కొందరు అధికారులు, రాజకీయ నేతలు కలసి దీనిని బడా వ్యాపారంగా మార్చేశారు. రూపాయికే కిలో బియ్యం పథకంలో లోపాలు కళ్లకు కనిపిస్తున్నా తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కావాలనే అచేతనంగా ఉండిపోయాయి. పథకం దుర్వినియోగం అవుతున్నా పట్టించుకోవడం లేదు. 42 ఏళ్ల క్రితం కిలో రెండు రూపాయలుగా ఉన్న బియ్యాన్ని తలకుమాసిన నేతలు అధికారంలోకి వచ్చి..కిలో రూపాయి చేశారు. ఇప్పటికే జనాభాలో 80శాతం మందికి ఈ బియ్యం ఇస్తున్నట్లు చెబుతున్నారు. అయినా ఇంకా కొత్తగా రేషన్ కార్డుల డిమాండ్ పుట్టుకొస్తోంది. పాతవాటిలో అక్రమాలను అరికట్టి, బియ్యం ధరలు పెంచి పక్కాగా పథకాన్ని అమలు చేయాల్సిన ఇరు రాష్ట్రాల సిఎంలు ఇంకా ప్రజలను మభ్య పెడుతున్నారు. వేలకోట్లు దుర్వినియోగం అవుతున్న ప్రజాధనానికి ఎవరు బాధ్యులు అన్నది చెప్పడం లేదు. ప్రజలు చెమటోడ్చి కడుతున్న పన్నుల డబ్బులను ఇష్టారీతిన వృధా చేయడమేనా పాలకుల పని అని ప్రజలు నిలదీయాల్సి ఉంది. ఇకపోతే ఎపిలో పేదల బియ్యం పూర్తిగా పక్కదారి పట్టాయి. రాష్ట్రంలో పేదలకు అందాల్సిన సబ్సిడీ బియ్యం టన్నుల కొద్దీ అక్రమంగా విదేశాలకు తరలించిన తీరు బయటపడ్డా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు ప్రతిపక్ష వైసిపి కారణమని టిడిపి కూటమి ఆరోపిస్తుంటే, మీరే కారణమని వైసిపి నేతలు టిడిపి, జనసేన నేతలను విమర్శిస్తున్నారు. ఈ పరస్పర విమర్శలతో కాలక్షేపం చేస్తున్నారు. లక్షల టన్నుల బియ్యాన్ని కొన్నేళ్ళుగా యథేచ్ఛగా తరలిస్తూ వచ్చారు. అసలు దోషులు బయట పడకుండా పేదల బియ్యాన్ని పెద్దలు గద్దల్లా ఎగరేసుకు పోయారు. తెలంగాణలో సైతం ఇలాంటి దోపిడీ జరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదు.

ఓట్లమీద ఉన్న శ్రద్ధ అక్రమాలను అరికట్టడంలో కనిపించడం లేదు. ప్రజా పంపిణీ ద్వారా పేదలకు అందుతున్న బియ్యం అసలు పేదలకు అందడం లేదన్నది అక్షర సత్యం.ఈ బియ్యంఆటో,లారీల స్థాయి దాటి ఓడల వరకు చేరిందని రుజువయ్యింది. బియ్యం పథకం పంపిణీ కార్యక్రమం కేంద్రాని దని, ప్రతి స్టోర్ దగ్గర మోడీ ఫోటో పెట్టాలని తెలంగాణ, ఆంధ్రలో పెద్ద యాగీ చేసిన కేంద్ర మంత్రులు, బిజెపి పెద్దలు అక్రమ బియ్యం తరలింపు విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారు. ఎందుకు దీనిపై చర్యలకు ఉపక్రమించడం లేదు. అన్ని రకాల సబ్సిడీ పథకాలను రద్దు చేసి సమీక్షించాలి. నిజమైన పేదలను గుర్తించాలి. దుబారా పథకాలకు కాలం చెల్లిందన్న విధంగా కళ్లెం వేయాలి. నగదు బదిలీ పథకాల అమలుపై సమీక్షించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఓట్లు ముడిపడి వున్నందున దీనిని సమీక్షించడం సాధ్యం కావడంలేదు. పేదలు రేషన్ బియ్యం ఎందుకు అమ్ముకుంటారన్న చర్చ చేయాలి. బహిరంగ మార్కెట్లో కనీసం 40లుగా ఉన్న బియ్యం ఇప్పుడు రూపాయికే దక్కితే అవి పెద్ద వ్యాపార వస్తువుగా మారింది. ఓడలకు ఎక్కించగలిగినంత బియ్యం అమ్మగలగడం ఇందుకు నిదర్శనం. ఎపిలో గత ఐదేళ్లలో 1.31 కోట్ల టన్నుల రేషన్ బియ్యం దేశం దాటి విదేశాలకు వెళ్లిందని టిడిపి కూటమి ప్రభుత్వం విమర్శిస్తున్నది. కాకినాడ ఓడరేవులో సిద్ధంగా వున్న ఓడను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనిఖీ చేసి సీజ్ చేయమని ఆదేశించారు. విశాఖపట్నం ఓడరేవులో రాష్ట్ర సివిల్ సప్లరు శాఖ మంత్రి ఇలాగే ఓ ఓడను తనిఖీ చేసి అందులో వున్న బియ్యం పేదల బియ్యమేనని ప్రకటించారు. ఇక తెలంగాణలో ఎంత దోచకున్నారో కిక్కురుమనడం లేదు. ఒకవైపు తిండి లేక పేదలు అల్లాడుతుంటే ఇంత పెద్ద ఎత్తున అక్రమంగా తరలిస్తున్న బియ్యం దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాల్సిందే. అధికార పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అనర్హులకు రేషన్ కార్డులు ఇవ్వడంవల్ల, అందులో ఎక్కువ మంది బియ్యం అమ్ముకునే వారు వుండే అవకాశం ఉంది. కానీ అత్యధిక పేదలు రేషన్ బియ్యంతోనే నెలలో కొద్ది రోజులైనా కడుపు నింపుకుంటున్నారు. ఇలా అక్రమాలను పక్కన పెట్టి సన్న బియ్యం ఇస్తామని ఒకరు, నాణ్యమైన బియ్యం ఇస్తామని మరొకరు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత...బియ్యాన్ని వ్యాపారంగా మార్చేస్తున్నారు. రేషన్ కార్డులకు ఇస్తున్న బియ్యానికి కిలో రూ. 43.50 ఖర్చు అవుతుందని ప్రభుత్వం చెబుతున్నది. ఇంత ఖర్చు చేసినా పేదలకు మంచి బియ్యం ఎందుకు ఇవ్వలేకపోతున్నా రన్నది కూడా ప్రశ్నే. ధాన్యం సేకరణ నుండే పాలకులు,ఉన్నతాధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. రీసైక్లింగ్కు పాల్పడుతున్నారు. నివాస ప్రాంతాల్లో స్టోర్ల ద్వారా పంపిణీ కావాల్సిన బియ్యాన్ని నేరుగా ఇతర రాష్ట్రాలకు తరలించి నాయకులు అప్పనంగా సంపాదించుకుంటున్నారు.

గ్రామాల వారీగా కార్డులు ఉన్నవారి వివరాలు సేకరించి, అందులో పేదలు ఎంతమందన్నది గుర్తించాలి. నిజమైన పేదలకే బియ్యం అందాలి. బియ్యం ధరలను కూడా సవరించాలి. అప్పుడే ఈ పథకంలో అక్రమాలను నిరోధించగలం.ప్రజా పంపిణీలో అక్రమాలను అరికట్టాలి. దోషులు ఎంతటి వారైనాసరే కఠినంగా శిక్షించాలి. అదే సమయంలో నాణ్యమైన బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా అసలు సిసలు పేదలకు అందించాలి.సార్వత్రిక ప్రజా పంపిణీ అమలు కొరకు ఉద్యమించాలి. అయితే పేదలు ఎవరన్నది కూడా నిర్వచించాలి. ఇన్నేళ్లుగా వారు పేదలుగానే ఎందుకు మగ్గుతున్నారో అధ్యయనం చేయాలి.

# చిక్కడు...దొరకడు..!

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ:** పవర్ ఈజ్ ఆల్ వేస్ పవర్ ఫుల్. అందుకే అధికార పార్టీలో ఉండేందుకు..ఆ పార్టీ కండువా కప్పుకునేందుకు తెగ ఆసక్తి చూపిస్తుంటారు నేతలు. ఒకసారి పార్టీ అధికారం కోల్పోయిందంటే చాలు..లీడర్లు సైలెంట్ అయిపోతుంటారు.అలాం టి నేతల్లో విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఒకరు. రియల్ ఎస్టేట్ రంగంలో ఆయనకంటూ అంతో ఇంతో పేరుంది. పాలిటిక్స్కు వచ్చేసరికి ఓ సారి ఎంపీ అయ్యారే తప్ప..ఎంవీవీ అంటే ఎవరూ ఠక్కున చెప్పలేని పరిస్థితి. ఎందుకంటే ఆయన విశాఖ ఎంపీగా పనిచేసిన కాలంలో కూడా పెద్దగా ప్రజల్లో తిరిగింది లేదు. జగన్ వస్తే వేదిక మీదకు మొక్కుబడిగా వచ్చి వెళ్లడం తప్పితే ఎంపీగా ఆయన పాత్ర చాలా పరిమితం. ఇందుకు బలమైన కారణమే ఉంది. రాజకీయాల్లో ఉంటూ వ్యాపారాలు చక్కబెట్టుకోవాలనున్నారు తప్పితే..రాజకీయం కోసం ఆయన ఏనాడూ వ్యాపారం చేయలేదని వైసీపీ నేతలే చెబుతుంటారు.అతి పెద్ద నగరంగా ఉన్న విశాఖ వంటి సిటీకి ఎంపీ అంటే రాష్ట్ర రాజకీయాలకు చాలా కీలకం. విశాఖలో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థల కార్యకలాపాల అంశంలోనూ, విభజన హామీలతో పాటుగా అనేక విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పలు సంప్రదింపులు, కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. కానీ ఎంవీవీ స్టైలే వేరు. ఆయన ఇలాంటి అంశాలపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవు.ఏపీలో వైసీపీ ఓడిపోయిన తర్వాత ఆ పార్టీ నేతలంతా డీలా పడిపోయారు. అక్కడో ఇక్కడో ఒకరిద్దరు నేతలు కాస్త మీడియా ముందు కనిపిస్తున్నారే తప్ప..దాదాపుగా అందరు నేతలూ సైలెంట్గా ఉన్నారు. అవంతి శ్రీనివాస్, ఆడారి ఆనంద్తో పాటుగా పలువురు నేతలు పార్టీకి గుడ్ బై చెప్పి వెళ్లిపోయారు. మరి కొంతమంది నేతలు కాస్తో, కూస్తో యాక్టీవ్గా ఉన్నారు. కానీ విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ వ్యవహారం హాట్ టాపిక్గా మారింది. ప్రస్తుతం ఆయన పార్టీలో యాక్టీవ్గా లేరు. పోనీ అలాగని అవంతి శ్రీనివాస్, ఆడారి ఆనంద్లా బయటకు వెళ్లిపోయారా అంటే అదీ లేదు. దీంతో అసలు ఎంవీవీ పార్టీలో ఉన్నారా..లేరా.. అనే కన్ఫ్యూజన్ క్యాడర్, లీడర్లలో కొనసాగుతోంది. పార్టీ ఓటమి తర్వాత ఎక్కడా కనిపించడమే లేదు. విశాఖ జిల్లా పార్టీ పరిస్థితులపై అధినేత జగన్ నిర్వహించిన సమీక్ష సమావేశాలకు కూడా ఎంవీవీ వెళ్లలేదు. అలాగే ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్గా విజయసాయిరెడ్డి నియమితులైన తర్వాత పార్టీ కార్యాలయంలో విశాఖ నేతలతో సమావేశం నిర్వహించారు. ఆ మీటింగ్కు కూడా ఎంవీవీ ఎగనామం పెట్టేశారు. అంతేకాదు రైతు సమస్యలపై అన్నదాతకు అండగా వైసీపీ, విద్యుత్ ఛార్జీలపైనా ఇటీవల వైసీపీ నిరసనలు చేపట్టింది. పార్టీ నేతలంతా పాల్గొనాలని హైకమాండ్ ఆదేశాలు జారీ చేసింది.

కానీ ఎంవీవీ సత్యనారాయణ ఎక్కడా పత్తా లేరు. దీంతో ఈ మాజీ ఎంపీ వ్యవహారంపై వైసీపీలో అందరికీ క్లారిటీ వచ్చేసింది. పార్టీకి దూరంగా ఉ ంటున్నాడంటే.. ఆయన కండువా మార్చేందుకు రెడీ అయ్యారన్న భావనకు వచ్చేశారట.ఎంవీవీ సత్యనారాయణ వైసీపీ కార్యకలాపాల్లో అస్సలు పాల్గొనడం లేదు. పార్టీని విడిచి పెట్టరు..అలాగని పార్టీ కోసం పనిచేయరు. పోనీ రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించారా అంటే అదీ లేదు. దీంతో వైసీపీ పెద్దలకు, క్యాడర్కు ఆయన వ్యవహారం ఏ మాత్రం అర్థం కావడం లేదట. 2019 ఎన్నికలకు ముందు పార్టీలో చేరి అనూహ్యంగా ఎంపీ అయిన ఎంవీవీని పార్టీ కూడా పట్టించుకోవడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి, ఓడిపోగానే మొహం చాటేస్తున్న నేత ఉంటే ఏంటీ, లేకపోతే ఏంటీ అన్న రీతిలో పెద్దలు ఉన్నారట.

# ఎస్సారెస్పీ చివరికి అందని సాగునీరు

## ఎండుతున్న పంటలు



**కరీంనగర్,తెలంగాణ దిశ:**రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంమరో ప్రాజెక్టు పరిధిలోని రైతులకు కష్టాలను తెచ్చిపెట్టింది. ఉత్తర తెలంగాణ వరదాయినిలా మారిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్వహణాలోపంతో చివరి ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు నెలకొన్నాయి. నీరందక ప్రాజెక్టు జోన్-1, జోన్-2 పరిధిలో యాసంగి పంటలు ఎండుముఖం పట్టాయి. చెరువులను నింపే బాధ్యతను ప్రభుత్వం విస్మరించిన కారణంగా ఉత్తర తెలంగాణ పరిధిలోని జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లోనెలలోనే 80 శాతం చెరువులు అడుగంటిపోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోనే దాదాపు 2,000 చెరువులను నింపే దిశగా చర్యలు తీసుకోకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిరుడు ఆగస్టు మాసంలోనే పూర్తిస్థాయిలో నిండింది. అక్టోబర్ వరకు ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి ఎగువ భాగం నుంచి నీరు వచ్చి చేరుతూనే ఉన్నది. ప్రాజెక్టు సామర్థ్యం కంటే మూడు రెట్లు నీరు రావడంతో గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్టులోకి వచ్చి చేరిన నీటితోపాటు, వర్షాధారితంగా చెరువులు పూర్తిస్థాయి నీటి మట్టాన్ని సంతరించుకోవడంతో వానకాలంలో ప్రాజెక్టు పరిధిలోని పంటలకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురుకాలేదు. యాసంగిలో సర్కార్ నిర్వహణాలోపంతో రైతులకు ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తుతున్నాయి. యాసంగిలో జోన్-1, జోన్-2 పరిధిలో ఉన్న నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల పరిధిలో 4,42,920 లక్షల ఎకరాల పంటలకు సాగునీరు ఇచ్చేందుకు ప్రాజెక్టు అధికారులు ప్రణాళికలు సిద్ధంచేశారు. డిసెంబర్ 25న జోన్ 2కు కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల ప్రారంభమైంది. గత జనవరి 2న జోన్ 1కి నీటి విడుదల చేశారు.

ఏప్రిల్‌లో నీటి విడుదల నిలిపివేత?: నీటి విడుదల ప్రక్రియ ఏప్రిల్ మొదటి వారం వరకే కొనసాగుతుందని అధికారులు తేల్చి చెప్తున్నారు. ఏప్రిల్ 2 నాటికి జోన్-2కు, ఏప్రిల్ 9 నాటికి జోన్-1 పరిధి ఆయకట్టుకు నీటి విడుదల గడువు ముగుస్తుందని చెప్తున్నారు. దీంతో రైతుల్లోఆందోళన నెలకొన్నది. ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలో యాసంగి నార్లు పోయడం ఆలస్యమైంది. జనవరి చివరి వారం వరకు నార్లు పోస్తూనే వచ్చారు. చివర్లో నాట్లేసిన రైతులకు ఏప్రిల్ చివరి వారం నుంచి మే మొదటి రెండు వారాల్లో పంటలు కోతకు వస్తాయి. ఏప్రిల్ 9 నాటికే వారబందీ ప్రకారం నీటి విడుదల ప్రక్రియ నిలిచి పోతే తమ పంటల పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వారబంధీ కారణంగా చివరి భూములకు నీరే అందడం లేదని ఆవేదన చెందుతున్నారు. జోన్-1, జోన్-2 పరిధిలో ఉన్న గొలుసుకట్టు చెరువులు, కుంటలను ప్రాజెక్టు నీటితో నింపే ప్రక్రియ చేపట్టకపోవడంతో పంటలు ఎండుతున్నాయి.

రైతులకు తప్పని సాగునీటి తిప్పలు: వారాబందీ పద్ధతిలో నీటి విడుదల కొనసాగుతున్న జోన్-1, జోన్-2 పరిధిలోని రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. కాలువల నిర్వహణ సరిగా లేక, చాలా చోట్ల మోటర్లతో నీటి చౌర్యంపై అధికారుల నిఘా సరిగా లేక డిస్ట్రిబ్యూటరీల చివరి ఆయకట్టు ప్రాంతాలకు నీరు అందడం లేదు. జోన్-1 పరిధిలో ఉన్న జగిత్యాల జిల్లాలోనే వివిధ డిస్ట్రిబ్యూటరీల చివరి ప్రాంతాలకు నీరు అందడం లేదు. జోన్-2 పరిధిలోని వెల్గటూర్ తదితర మండలాల్లోని వివిధ గ్రామాలకు ప్రాజెక్టు నీరు చేరడం లేదు. దీనికి తోడు కాకతీయ ప్రధాన కాలువతోపాటు, డిస్ట్రిబ్యూటరీ కాలువలకు చాలాచోట్ల లైనింగ్ లేక, పిచ్చిమొక్కలు మొలిచి కాలువలు ధ్వంసమయ్యాయి.

# సంకల్పమే ఆమె బలం



**విజయనగరం,తెలంగాణ దిశ:**సాదాసీదా వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె టీచర్ కావాలని లక్ష్యం పెట్టుకుంది. ఆ సంకల్పంతో ఎదురైన ప్రతి అవరోధాన్ని అధిగమించింది. ఆత్మ విశ్వాసాన్ని ఆయుధంగా చేసుకుంది. ఎక్కడైతే చదువుకుందో అక్కడే కొలువుదీరింది. ఇది విజయనగరం జిల్లా తెర్లాం మండల కస్తూరిబా విద్యాలయంలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న చింత దివ్య గురించిన సంగతి! చిన్నయ్యపేట గ్రామానికి చెందిన దివ్య తల్లిదండ్రులు చింత పార్వతి, వెంకటరమణ. వీరిది వ్యవసాయ కుటుంబం. వీరికి ఇద్దరు పిల్లలు. పెద్దమ్మాయి డిగ్రీవరకు చదువుకుంది. రెండో కుమార్తె దివ్య. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు స్వగ్రామంలోనే ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంది. తర్వాత తెర్లాం మండల కేంద్రంలోని జెడ్‌పి హైస్కూలులో ఆరో తరగతిలో చేరింది.

కుటుంబంలో ఎదురైన ఆర్థిక ఇబ్బందులు ఆమెను తెర్లాం కస్తూరిబా విద్యాలయంలో చేరేలా చేశాయి. పదో తరగతి వరకు అక్కడే చదువుకుంది. కెజిబివిలో ఉపాధ్యాయుల ప్రోత్సాహం, ఉత్తమ బోధన దివ్యలో నూతన ఆశలను రేకెత్తించాయి. తన బాల్యంలోని ఎదురైన సమస్యలు, కష్టాలు దివ్యలో పట్టుదలను పెంచాయి. ఇవి అధిగమించాలంటే విద్యే శక్తివంతమైన మార్గమని విశ్వసించింది. ఎప్పటికప్పుడు తాను నేర్చుకుంటూ మిగతా విద్యార్థులకు నేర్పించాలనే ఆశయంతో ముందుకు సాగింది. తాను కూడా ఉపాధ్యాయురాలినై ఇలాంటి పిల్లలకు చదువు చెప్పాలని గట్టిగా అనుకుంది. అదే లక్ష్యంతో చదువుకుంది.

పదో తరగతిలో 8.7 గ్రేడ్ పాయింట్లు వచ్చాయి. ఇంటర్ పాలకొండలోని సత్యసాయి కాలేజీలో చేరి 943 మార్కులు సాధించింది. విజయనగరంలోని ఎంఆర్ అటానమస్ కాలేజీలో డిగ్రీ, గొట్లాంలోని గాయత్రి కాలేజీలో బిఇడి పూర్తి చేశారు. ఆ తరువాత ఎంఆర్ పిజి కాలేజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన దివ్య పలు ప్రైవేటు స్కూళ్లలో టీచర్‌గా చేరారు. అయితే తన చదువుకు బాటలు వేసిన కెజిబివిలో ఉపాధ్యాయురాలిగా చేరాలనే లక్ష్యం మాత్రం ఎప్పుడూ విడిచిపెట్టలేదు. సాధించి తీరాల్సిందేనన్న ఆమె పట్టుదలకి గతేడాదే ప్రతిఫలం వచ్చింది.

2024 నవంబర్ 23న విజయనగరం తెర్లా గ్రామ కెజిబివిలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా ఆమె నియమితులయ్యారు. 'తన చదువుకు బాటలు వేసిన కెజిబివిలోనే ఉపాధ్యాయురాలిగా ఉద్యోగంలో చేరడం ఆనందంగా ఉందని దివ్య ఎంతో సంతోషిస్తున్నారు.


తాను చదివినప్పుడు ఉన్న తెలుగు మాధ్యమం స్థానంలో ఇప్పుడు ఆంగ్ల మాధ్యమం అమలు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ 'పేద పిల్లలకు ఇంగ్లీషు బోధించడంతో పాటు ప్రతి విద్యార్థికీ కెరీర్ గైడెన్సు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ స్కిల్స్ అందించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాల'ని అంటున్నారు.

'విద్యార్థిగా ఉన్నప్పుడు ఎదురైన కష్టాలను ఎప్పుడూ మర్చిపోను. ఆ అనుభవాలు నాకు విద్యార్థులను అర్థం చేసుకునే అవకాశం ఇస్తాయి. ప్రతి విద్యార్థి తన విద్య ద్వారా సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా ఎదగాలి. అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలి' అని దివ్య విద్యార్థులకు సూచిస్తున్నారు.

# అమరావతి అప్పులకు లైన్ క్లియర్

**విజయవాడ,తెలంగాణ దిశ:**రాజధాని నిర్మాణానికి సేకరించిన భూముల్ని విక్రయించడం ద్వారా నిధులు సమీకరిస్తామని, ప్రజలపై ఎలాంటి భారాలు మోపమని ఏపీ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణంపై వైసీపీ అధ్యక్షుడు జగన్ వ్యాఖ్యల్ని నారాయణ ఖండించారు. మరోవైపు అమరావతి రుణాలకు లైన్ క్లియర్ అయ్యింది.అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకున్న భూముల్లో కొంత మేర అమ్మడం ద్వారా రాజధానిని నిర్మిస్తామని మంత్రి నారాయణ వివరించారు. మరోవైపు అమరావతి రుణాల మంజూరులో ఎదురవుతోన్న సాంకేతిక సమస్యలను అధిగమించినట్టు సిఆర్‌డిఏ ప్రకటించింది. రాజధాని అప్పులపై ఆర్థిక సంస్థలు సంతృప్తి చెందినట్టు సీఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం అమరావతి నిర్మాణం కోసం ప్రజలపై ఒక్క రూపాయి కూడా భారం వేసేది లేదని చెప్పారు. అమరావతిపై మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి నారాయణ నెల్లూరులో మీడియాతో మాట్లాడారుఅమరావతి రాజధాని నిర్మాణానికి హడ్కో, ప్రపంచ బ్యాంకు, ఎడిబి తో పాటు జర్మనీ బ్యాంకు నుంచి రుణాలు సేకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాజధానిపై ప్రతిపక్షాల మాటలు వినవద్దని, నమ్మవద్దని ప్రజలకు సూచించారు. రాజధాని అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ఉండాలని సీఎం భావిస్తున్నారని, అందుకు అనుగుణంగా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని చెప్పారు.రాష్ట్ర బడ్జెట్ లో అమరావతికి 6 వేల కోట్లు కేటాయించారని, అవసరమైతే ఇంకా నిధులు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పినట్టు మంత్రి వివరించారు. రాజధాని విషయంలో పారదర్శకంగా ఉంటామని, ఎలాంటి అవకతవకలు ఉండవని మరోసారి స్పష్టం చేశారు.నాఫీరేట్ల ప్రకారం మాత్రమే టెండర్లు పిలిచి నిర్మాణాలు చేస్తున్నామని, గత ప్రభుత్వం మాదిరిగా నిధులు పక్క దారి పట్టించడం లేదని చెప్పారు. 217 చ.కి.మీ పరిధిలో పరిధిలో అంతర్జాతీయ ప్రమాణాలతో 5 వేల ఎకరాల్లో రాజధాని నిర్మాణం జరుగుతుందన్నారు. 50 వేల కోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి నారాయణ చెప్పారు. అమరావతిలో 1000 నుంచి 1200 ఎకరాల్లో అంతర్జాతీయ యూనివర్సిటీలు, పాఠశాలలు, పలు సంస్థలకు భూములు కేటాయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు.అమరావతి నిర్మాణానికి ప్రపంచ ఆర్థిక సంస్థలు ఇప్పటికే రుణాలను మంజూరు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. పలు అంతర్జాతీయ సంస్థలతో పాటు హడ్కో కూడా భారీగా రుణాలను ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ క్రమంలో రాజధాని నిర్మాణం, రాజకీయ అభ్యంతరాలపై రుణాలను మంజూరు చేసే సంస్థలకు పలువురు ఫిర్యాదు చేశారు. అమరావతి నిర్మాణంపై రాజకీయంగా ఏకాభిప్రాయం లేదని ఫిర్యాదు చేయడంతో నిధుల విడుదలలో జాప్యం జరిగింది. డిసెంబర్ నాటికి రుణాలకు సంబంధించిన నిధులు విడుదల కావాల్సి ఉండగా అందులో జాప్యం జరిగింది.ఈ మంజూరులో జరుగుతున్న జాప్యంపై సిఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు వివరణ ఇచ్చారు. రుణాల మంజూరుపై వ్యక్తమైన అభ్యంతరాలకు వివరణ ఇచ్చినట్టు స్పష్టం చేశారు. ఆయా సంస్థల ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సంతృప్తి వ్యక్తం చేశారని వివరించారు. రుణాల విడుదలకు సంబంధించిన ప్రక్రియ కూడా పూర్తి కావచ్చిందని బ్యాంకు ఖాతాలు కూడా సిద్ధమైనట్టు తెలిపారు. రుణ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేవని కన్నబాబు వివరించారు.

# కమలం గూటికి విజయసాయిరెడ్డి..?



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ:**మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వైసీపీతో పాటు తన ఎంపీ పదవికి కూడా హఠాత్తుగా రాజీనామా చేశారు. ఇక తాను రాజకీయాలకు దూరమని హార్టికల్చర్ చేసుకుంటానని ప్రకటించారు. అన్నట్లుగానే ఆయన రాజీనామా చేసి కొన్నాళ్లు కనిపించకుండా పోయారు. ఈ మధ్యలో ఆయన కొన్ని రహస్య సమావేశాలు నిర్వహించారు. కానీ వివరాలు బయటకు రాలేదు. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్‌ను కూడా కలిశారు. కంది ఐఐటికి వచ్చిన ఆయనకు ప్రోటోకాల్ లేకపోయినా ఆయన వద్దకు వెళ్లి మరీ ఆహ్వానించడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఆయనకు ఎందుకు అవకాశం వచ్చిందో మెల్లగా కన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. విజయసాయిరెడ్డి రాజకీయాలకు శాశ్వతంగా దూరం కాలేదు. ఆయన కొంత విరామం తీసుకోవాలనుకున్నారు. ముఖ్యంగా వైసీపీకి రాజీనామా చేసిన వెంటనే మరో పార్టీలో చేరితే అనేక ప్రశ్నలు వస్తాయని అందుకే కొంత కాలం విశ్రాంతి తీసుకోవాలని అనుకున్నారు. భారతీయ జనతా పార్టీలో చేరేందుకు అన్నీ మాట్లాడుకున్న తర్వాతనే రాజీనామా చేశారని ప్రస్తుతం ఓ క్లారిటీ వచ్చిందని అంటున్నారు. ఆయన బయటకు కనిపించకపోయినా..తెలియకపోయినా బీజేపీ పెద్దలతో నిరంతరం టచ్ లో ఉంటున్నట్లుగా తెలుస్తోంది. తాను రాజీనామా చేసిన రాజ్యసభ సీటును మళ్లీ ఆయన కోరుకోవడం లేదు. పదవి లేకపోయినా పర్వాలేదు ఆయన బీజేపీలో చేరాలనుకుంటున్నారు. అందుకే తను రాజీనామా చేసిన స్థానంలో ఉపఎన్నిక జరిగిన వెంటనే ఆయన బీజేపీలో చేరేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారని చెబుతున్నారు.ఇప్పటి వరకూ ఉన్న విశ్వసనీయ సమాచారం మేరకు జూన్ లేదా జూలై నెలల్లో బీజేపీ తీర్థాన్ని పుచ్చుకునేందుకు విజయసాయిరెడ్డి రెడీ అయ్యారని అంటున్నారు. బీజేపీ పెద్దలు కూడా ఈ అంశంపై సానుకూలంగా ఉన్నారని.. అలా డీల్ మాట్లాడుకున్నందునే రాజీనామా చేశారని అంటున్నారు. అయితే విజయసాయిరెడ్డిని పార్టీలో చేర్చుకోవడంపై కూటమి పార్టీలు ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ఆయన తన పదవికి రాజీనామా చేసినప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ గురించి చాలా పద్దతిగా మాట్లాడారు. వారిపై తాను చేసిన వ్యాఖ్యలు కేవలం రాజకీయాల్లో భాగంగా చేసినవే తప్ప.. వ్యక్తిగతంగా తనకు వారితో మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. విజయసాయిరెడ్డిపై అనేక కేసులు ఉన్నాయి. జగన్ అక్రమాస్తుల కేసుల్లో ఆయన ఏ2గా ఉన్నారు. అలాగే కాకినాడ పోర్టును బెదిరించి రాయించుకున్నారన్న కేసుల్లోనూ ఇటీవల ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఇంకా అనేక స్కాముల్లో ఆయన పేరు ఉందని ప్రచారం జరుగుతున్న సమయంలోఆయన వైసీపీకి గుడ్ బై చెప్పారు. ఇప్పుడు బీజేపీలో చేరాలనుకుంటున్నారు. ఆయనను చేర్చుకుంటారా లేదా అన్నదానిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది.

## పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ కృషి

### – జిల్లా ఎస్పీ శ్రీ టి శ్రీనివాస రావు

**జోగులాంబ,తెలంగాణ దిశ:** పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశ హాల్ నందు జిల్లా ఎస్పీ జిల్లా పోలీస్ స్పెషల్ పార్టీ, ఏ.ఆర్ సెక్షన్, ఎస్కార్ట్, బీడీ టీమ్స్, డాగ్ స్క్వాడ్,సాయుధ సిబ్బంది తో (దర్బార్) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీస్ పాత్ర కీలకం అని, జిల్లా లో సాయుధ దళ పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు సంతృప్తికరంగా ఉన్నాయని అన్నారు. సిబ్బంది విధులను చక్కగా నిర్వహించడంతో పాటు ఆరోగ్యం, కుటుంబ సభ్యుల సంక్షేమంపై దృష్టి పెట్టాలని అన్నారు. శారీర కంగా, మానసికంగా దృఢంగా ఉండాలని ఇందుకోసం నిత్యం వ్యాయామం, యోగ చేయడం అలవర్చుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలని, భాద్యతగా తమ విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలని సూచించారు. పోలీసులు వృత్తి నిర్వహణలో నైపుణ్యాలను పెంచుకోవాలని అన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంటామని తెలిపారు. నిరంతరం విధులలో ఉండే పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యక్తిగత, కుటుంబపరమైన, శాఖాపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటామని వివరించారు. సిబ్బందికి విధులలో ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకొని వారిపై ఒత్తిడి లేకుండా విధులు నిర్వహించేలా అధికారులకు ఎస్పీ పలు ఆదేశాలు జారీ చేశారు. చిత్తశుద్ధి తో విధులు నిర్వహించి ప్రజలలో పోలీస్ శాఖకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంచేలా కృషి చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాయుధ దళ డి.ఎస్పి నరేందర్ రావు, ఆర్ ఐ వెంకటేష్, సాయుధ దళ అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మత విద్వేష దాడులకు ప్రతిఘటన

సంఘ పరివార్ రాజకీయ వ్యవస్థలోకి అంతకంతకూ ఎక్కువగా మతతత్వ విషాన్ని ఎక్కిస్తున్నది. సామాన్య జనంలో, అధికార యంత్రాంగంలో పెరుగుతున్న దాని మద్దతుదారులు ముస్లింలపై లెక్కలేనన్ని దాడులకు కారణమవుతున్నారు. ఈ దాడులకు పిల్లలు, శిశువులు కూడా లక్ష్యాలుగా మారు తున్నారని ఇటీవలి ఘటనలు వెల్లడించడం మరీ విషాదకరం.

మహారాష్ట్ర సింధుర్గ్ జిల్లాలో చిన్న పట్టణం మాల్వన్‌లో పదిహేనేళ్ల వయసుగల ఒక ముస్లిం కుర్రాణ్ని పోలీసులు నిర్బంధించారు. అతని తల్లిదండ్రులను కూడా అరెస్టు చేశారు. వారికి వున్న చిన్న షాపును మునిసిపల్ కార్పొరేషన్ ఫిబ్రవరి 25న నేలమట్టం చేసింది. విశ్వహిందూ పరిషత్‌కు చెందిన ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన ఎఫ్.ఐ.ఆర్ దీనంతటికి ఆధారమైంది. తాను ఆ బాలుని ఇంటి ముందు నుంచి పోతుండగా ఆ అబ్బాయి భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ తిలకిస్తున్న సమయంలో పాకిస్తాన్ అనుకూల నినాదాలు వినిపించాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాడూ బొంగరం లేని ఈ ఫిర్యాదు ఎలాంటిదో తెలిసి కూడా ఎలాంటి దర్యాప్తు జరపకుండానే పోలీసులు ఆ బాలుడి ఇంటికి వచ్చారు. భయంతో హడలిపోయిన ఆ అబ్బాయిని బలవంతంగా లాక్కుపోయారు. అతని తల్లిదండ్రులను జైలుకు పంపేసి అతన్ని మాత్రం పరిశీలన గృహానికి చేర్చారు. భారతీయ న్యాయ సంహిత 196వ సెక్షన్ (అంటే మతం ప్రాతిపదికగా వివిధ తరగతుల మధ్య శతృత్వం సృష్టించడం), సెక్షన్ 1973(5) (జాతీయ సమైక్య తకు హాని చేసే ఆరోపణలు, నిర్ధారణలు చేయడం), సెక్షన్ 3(5) (ఒక పథకం ప్రకారం వేర్వేరు వ్యక్తులు అనేకమంది కలిసి చర్యలు చేపట్టడం) కింద వారిపై ఆరోపణలు చేశారు. మైనార్టీలకు వ్యతిరేకంగా సిగ్గుచేటైన రీతిలో పద్ధతి ప్రకారం నిరంతరాయంగా బనాయించబడుతున్న కేసులు ఇవే. నిజానికి వీటికి అసలైన కారకులుగా వున్న హిందూత్వ విద్వేష ప్రచారకులను మాత్రం యథేచ్ఛగా వదిలివేస్తున్నారు.

విధ్వంసంతో భయోత్పాతం: ఆ మరుసటి రోజున కొంతమంది మోటారు సైకిల్ ప్రదర్శన జరిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ కుటుంబాన్ని,ళ% వుంటున్న చోటు నుంచి తరిమేయాలని వారు కోరారు. అదేరోజు వారి తుక్కు కొనుగోలు దుకాణాన్ని ధ్వంసం చేశారు. ఆ తల్లిదండ్రులకు బెయిల్ రాగా ఆ పిల్లవాడిని మామయ్యకు అప్పగించారు. అయితే వారి కష్టాలు అంతటితో ముగియలేదు. వారికి అసలే జీవనోపాధి లేకుండా పోయింది. వారి పిల్లాడు భయోత్పాతంతో హడలిపోయి నోరు తెరచి మాట్లాడటానికే జంకుతున్నాడు. కాగా ఈ ఘటన నుంచి సాధ్యమైనంత రాజకీయ లబ్ది పొందడాని స్థానిక బిజెపి ఎం.ఎల్.ఎ నిలేష్ రాణే ప్రయత్నిస్తున్నారు. ఆ బాలుడి తండ్రి అత్యంత అనుమాన స్పదమైన వ్యక్తి అనీ, ఆ జిహాదీని జిల్లా నుంచి పంపించేయడానికి తను చేయగలిగిందంతా చేస్తానని చిందులు తొక్కుతున్నారు. చిన్న పిల్లలు విషపూరితమైన మతదాడులకు బలవుతున్నారనేది ఒకటైతే అతన్ని అరెస్టు చేసిన పోలీసులు అమానుషంగా చట్ట విరుద్ధంగా ప్రవర్తించారు. మునిసిపల్ అధికారులు అతని తండ్రి దుకాణాన్ని బుల్డోజర్లతో ధ్వంసం చేశారు. ముందుగా చట్టబద్ధమైన అనుమతి తీసుకోకుండా బుల్డోజర్లు వాడరాదనే సుప్రీంకోర్టు తాజా తీర్పును కూడా తోసి రాజని ఈ విధ్వంసానికి పాల్పడ్డారు.

కసికందు బ: మాల్వన్ తర్వాత దాన్ని వెంటనంటి అంతకన్నా ఘోరమైన ఘటన జరిగింది. మార్చి 2న రాజస్థాన్ అల్వార్ జిల్లాలో పోలీసులు బూరా రాత్రి వేళ ఇమ్రాన్ ఇంటిపై దాడి చేశారు. మహిళా పోలీసులు లేకుండానే వెళ్లారు. ఇమ్రాన్ భార్య రజిదా, నెల కూడా నిండని తన బిడ్డ అలిషా నిద్రపోతున్నారు. పోలీసులు రజిదాను ఇంట్లో నుంచి వీధిలోకి ఈడ్చుకొచ్చారు కొంతమంది ఆమె మంచం పైకి దూకి ఆ బిడ్డను నలిపేయడంతో అక్కడే ప్రాణం పోయింది. ఆ పోలీసులు వారంట్ తీసుకుపోవడంగాని ముందే నోటీసు జారీ చేయడంగాని జరగలేదు. రోజు కూలీగా పనిచేసే ఇమ్రాన్‌కు ఎలాంటి నేర చరిత్ర కూడా లేకపోయినా ఇలా జరిగింది. ఆ కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయాలని ప్రయత్నించారుగానీ ఎవరూ పట్టించుకోలేదు. ఆ మరురోజు ఇరు మతాలకూ చెందిన అనేకమంది గ్రామస్తులు దీనిపై ఎస్.పి కార్యాలయం ముందు ప్రదర్శన జరపగా ఎఫ్.ఐ.ఆర్ నమోదైంది. పొంచిన ప్రమాద సంకేతం: మతతత్వ విద్వేషంతో పోలీసు సిబ్బంది అమ్మ చేతుల్లోని అమాయక కసికందుపై అమానుషమైన నేరానికి పాల్పడ్డం ఓ ప్రమాదకర సంకేతం. సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్, రాష్ట్ర కార్యదర్శి కిషన్ పరీఖ్‌ల నాయకత్వంలో ఒక ప్రతినిధి బృందం అల్వార్‌లో ఆ కుటుంబాన్ని సందర్శించి పోలీసుల ఘోర నేరానికి పాల్పడినట్టు ధృవీకరించింది. అపరాధులైన పోలీసులపై వెంటనే చర్య తీసుకోవాలని, హత్యానేరం నమోదు చేసి విచారించాలని వారు డిమాండ్ చేశారు. అధికార యంత్రాంగం సుప్రీం కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేయడానికి సిద్ధపడటం, మహిళలు, శిశువులపై పోలీసు సిబ్బంది నేరాలకు పాల్పడటం జరుగుతున్న వేళ వారికి వ్యతిరేకంగా ప్రజల నిరసన ప్రజ్వరిల్లాల్సిన అవసరముంది. సంఘ పరివార్ తీసుకొస్తున్న ఈ విభజన రాజకీయాలను గట్టిగా తిప్పికొట్టవలసిన అవసరం ఎప్పటికంటే ఇప్పుడు మరింత తక్షణావసరంగా ముందుకొస్తున్నది. అల్వార్ అమానుష నేపథ్యంలో ఆ అభాగ్య ముస్లిం కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రజాస్వామిక శక్తులన్నీ ఒక్కుమ్మడిగా కదలవలసి వుంది.

# అక్రమ వలసదారుల ఆస్తులు జప్తు



వాషంగ్టన్: గ్రేట్ అమెరికా మేక్ ఎగైన్ నినాదంలో అగ్రరాజ్యం ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచారు డొనాల్డ్ ట్రంప్. ఆయన జనవరి 20, 2025న బాధ్యతలు చేపట్టారు. దూకుడైన పాలన, సంచలన నిర్ణయాలతో అటు అమెరికన్లను, ఇటు ప్రపంచ దేశాలను భయపెడుతున్నారు. ఇప్పటికే వలసవాదులపై కఠిన ఆంక్షలు విధిస్తున్నారు. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా మరో నిర్ణయం తీసుకున్నారు.డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులపై కఠిన చర్యలకు ఉపక్రమించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో స్వీయ బహిష్కరణ (సెల్ఫ్ డిపోర్టేషన్) ద్వారా దేశం వీడాలని, లేకుంటే రోజుకు దాదాపు రూ.86,000 జరిమానాతో పాటు ఆస్తుల జప్తు, జైలు శిక్ష వంటి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తోంది. ఈ కథనం ట్రంప్ యంత్రాంగం యొక్క కొత్త విధానాలు, జరిమానా విధానం, సామాజిక–ఆర్థిక పరిణామాలను వివరిస్తుంది.హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం అక్రమ వలసదారులను స్వీయ బహిష్కరణకు ప్రోత్సహించేందుకుహోమ్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్ ద్వారా నమోదు చేసుకొని దేశం వీడితే సురక్షితమని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని అధికార ప్రతినిధి ట్రిసియా మెక్‌లిన్ వెల్లడించారు. మార్చి 31న సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని స్పష్టం చేసిన,తనిఖీల్లో పట్టుబడితే సంపాదించిన ఆస్తులు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ విధానం అక్రమ వలసదారుల్లో భయం కలిగించి, వారిని స్వచ్ఛందంగా దేశం వీడేలా చేయడమే లక్ష్యంగా కనిపిస్తోంది.ట్రంప్ పరిపాలన అక్రమ వలసదారులపై రోజుకు 998 డాలర్ల (సుమారు రూ.86 వేల) జరిమానా విధించే ఆదేశాలను జారీ చేసింది. సెల్ఫ్ డిపోర్టేషన్ యాప్‌లో నమోదు చేసుకొని దేశం వీడని వారిపై 1,000 నుంచి 5వేల డాలర్ల వరకు జరిమానా విధించనున్నారు. ఈ జరిమానాలు చెల్లించకపోతే ఆస్తుల జప్తు, జైలు శిక్ష వంటి చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాక, బహిష్కరణ ఆదేశాలను ఉల్లంఘించిన వారు భవిష్యత్తులో అమెరికాకు తిరిగి రావడానికి అవకాశం కోల్పోతారని స్పష్టం చేసింది. ఈ చర్యలు అక్రమ వలసలను నియంత్రించడంలో భాగమని ట్రంప్ యంత్రాంగం పేర్కొంటోంది. ఈ జరిమానా విధానం 1996లో తీసుకొచ్చిన ఇమిగ్రేషన్ చట్టంలో భాగం. ట్రంప్ తన మొదటి పరిపాలనలో (2017-2021) ఈ చట్టాన్ని అమలు చేసి, తొమ్మిది మంది అక్రమ వలసదారులపై జరిమానాలు విధించారు. అయితే, కొన్ని కేసుల్లో ఈ జరిమానాలు ఉపసంహరించబడ్డాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బైడెన్ పరిపాలన ఈ జరిమానా విధానాన్ని నిలిపివేసింది. ఇప్పుడు ట్రంప్ మళ్లీ ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నారు. ఇమిగ్రేషన్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ జరిమానాలు కోర్టులో సవాలు చేయడం సాధ్యమైనప్పటికీ, విజయం సాధించే అవకాశాలు తక్కువ. ఈ చర్యల ఉద్దేశం భయం కలిగించి వలసదారులను దేశం వీడేలా చేయడమేనని వారు అంచనా వేస్తున్నారు.ఈ కొత్త విధానాలు అమెరికాలోని అక్రమ వలసదారుల జీవనంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. అమెరికాలో సుమారు 1.1 కోట్ల మంది అక్రమ వలసదారులు ఉన్నట్లు అంచనా. వీరిలో చాలామంది స్థానిక ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారు, ముఖ్యంగా వ్యవసాయం, నిర్మాణం, సేవా రంగాల్లో. భారీ జరిమానాలు, బహిష్కరణ భయం వల్ల వీరు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది, దీనివల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థలపై కూడా ప్రతికూల ప్రభావం పడవచ్చు. అంతేకాక, ఈ చర్యలు మానవ హక్కులపై చర్చను రేకెత్తించాయి, వలసదారుల సమాజంలో భయాందోళనలను పెంచుతున్నాయి.ట్రంప్ యొక్క ఈ విధానాలు అంతర్జాతీయ సమాజంలోనూ చర్చనీయాంశంగా మారాయి. లాటిన్ అమెరికా, ఆసియా దేశాల నుంచి వచ్చిన వల సదారులు ఎక్కువగా ఉండటంతో, ఈ దేశాల ప్రభుత్వాలు తమ పౌరుల రక్షణ కోసం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఉదాహరణకు, మెక్సికో వంటి దేశాలు బహిష్కరణకు గురైన వలసదారుల కోసం తాత్కాలికశిబిరాలను ఏర్పాటు చేస్తున్నాయి. భవిష్యత్తులో ఈ విధానాలు మరింత కఠినతరం కావచ్చని, దీనివల్ల అమెరికా–ఇతర దేశాల మధ్య దౌత్య సంబంధాలపై ప్రభావం పడవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ట్రంప్ యంత్రాంగం అక్రమ వలసలపై చూపిస్తున్న ఈ దూకుడు విధానం దేశభద్రత, చట్టపాలనను కాపాడేందుకని అధికారులు పేర్కొంటున్నప్పటికీ, దీని వెనుక రాజకీయ, సామాజిక ఉద్దేశాలు ఉన్నాయని విమర్శకులు అంటున్నారు. భారీ జరిమానాలు, ఆస్తుల జప్తు వంటి చర్యలు వలసదారులను భయపెట్టి స్వచ్ఛంద బహిష్కరణకు ఒత్తిడి చేసే వ్యూహంగా కనిపిస్తున్నా యి. అయితే, ఈ విధానాలు దీర్ఘకాలంలో ఆర్థిక, మానవీయ సవాళ్లను తెచ్చిపెట్టవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్రమ వలసదారుల సమస్యను పరిష్కరించాలంటే కేవలం జరిమానాలు, బహిష్కరణల కంటే సమగ్రమైన, మానవీయ విధానం అవసరమని సమాజంలో ఒక వాదన బలంగా వినిపిస్తోంది.

# కరీంనగర్ లో కార్పొరేషన్ వర్సెస్ ఇరిగేషన్



**కరీంనగర్,తెలంగాణ దిశ:**కరీంనగర్ నగరపాలక సంస్థ కు ముఖ ద్వారం....పట్టణ ప్రారంభ ప్రాంతం...8వ డివిజన్ అల్గునూరు పరిధిలోని శివారు ప్రాంతం... కరీంనగర్– హైదరాబాద్ రాజీవ్ రహదారికి సమీప ప్రాంతం... మానకొండూరు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కు కూత వేటు దూరం... ఇన్ని అడ్రస్సులు చెప్పిన ఆ కాలనీలను కనుక్కోలేని పరిస్థితి... ఎందుకంటే... ఆ కాలనీలకు 40ఏళ్లుగా గుర్తింపు లేదు... కనీసం ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని గుర్తిస్తూ ఓ బోర్డు కూడా ఏర్పాటు చేయలేని దుస్థితి... ప్రస్తుతం ఈ ప్రాంతాలన్నీ మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్నాయి.అది కూడా కరీంనగర్ కు స్వాగతం చెప్పే మొట్టమొదటి కాలనీల సమస్యలపై ప్రత్యేక కథనం.. ఒకప్పుడు ఎల్ ఎం డి కాలనీకి అనుబంధంగా ఇక్కడ శ్రీ వెంకటేశ్వర కాలనీ,హుస్సేన్ నగర్, క్రిస్టియన్ కాలనీ , వినాయక నగర్, చేపల కాలనీ , తమిళ కాలనీలు ఏర్పడ్డాయి.. ఇక్కడి ప్రాంతంలో ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులు, వ్యవసాయదారులు, మత్స్యకారులు ఉన్నారు. ఈ ప్రాంతానికి సమీపంలోనే ఎస్ ఆర్ ఎస్ పి (ఎల్ఎండి కాలనీ) కార్యాలయాలు, అలుగునూరు విద్యుత్ సబ్ స్టేషన్, పే అండ్ అకౌంట్ ఆఫీస్ , భూగర్భ జల శాఖ, మండల విద్యాధికారి కార్యాలయం, టీచర్ ట్రైనింగ్ సెం టర్, మానసిక వికలాంగుల పాఠశాల, బీసీ రెసిడెన్షియల్ హాస్టల్, మహిళా ప్రాంగణం లాంటి ఎన్నో ముఖ్యమైన కార్యాలయాలు, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి, శ్రీ రామ సాయి దేవాలయం లాంటివి ఉన్నా యి.ఇక్కడి ప్రాంత రహదారులన్నీ ఇరిగేషన్ భూములతో కనెక్ట్ అయ్యి ఉన్నాయి. రహదారుల అభివృద్ధి ఇరిగేషన్ డిపార్ట్మెంట్ చూసుకుంటుందని ఎవరికి వారే అనుకొని దాదాపు 40 ఏళ్లుగా ఇక్కడి ప్రాంత రహదారుల అభివృద్ధిని మరిచిపోయారు. ఇంతటి ముఖ్యమైన ప్రాంతంలో నివసిస్తున్న కాలనీ ప్రజలు రోడ్ల విషయంలో, ఇతరసమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు.. కాలనీలో సరైన రోడ్లు , మురికి కాలువలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు అలుగునూరు గ్రామపంచాయతీలో అదే కష్టాలు.. నేడు నగరపాలక సంస్థలో ఉన్న అవే కష్టాలు... అసలు ఈ కాలనీలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు.. ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలు కలిగి ఉండి, అనునిత్యం బిజీగా ఉండే ఈ ప్రాం తం నేడు అనేక సమస్యలతో కుట్టుమిట్టా డుతుంది. ప్రస్తుతం కాలనీ ప్రధాన రహదారి కేవలం 10 ఫీట్ల వెడల్పుతో ఉండి, కంకర తేలిపోయి, రహదారి చుట్టూ దట్టమైన చెట్లు, పిచ్చి మొక్కలతో రోడ్డు కమ్ముకపోయి ప్రమాదకరంగా మారిపోయింది. వాహనదారులు ప్రజలు రాకపోకలు కొనసాగించడానికి అనేక ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చింది. దీనికి తోడు రాత్రివేళ ఇక్కడి ప్రాంతంలో వీధి దీపాలు లేకపోవడంతో స్థానిక ప్రజలు నానా అవస్థలు పడు తున్నారు. ఇట్టి రహదారిని అభివృద్ధి చేయాలని ఐదేండ్లుగా ప్రజా ప్రతినిధులకు, అధికారులకు అక్కడి కాలనీవాసులు ఫిర్యాదు చేసిన ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకున్న పాపాన పోలేదు.కార్పొరేషన్ లో తమ కాలనీని విలీనం చేసి నేటికీ ఐదు సంవత్సరాలు గడిచిపోయాయని, కనీసం రోడ్డుకు అడ్డంగా అస్తవ్యస్తంగా ఉన్న పిచ్చి మొక్కలు,చెట్లను తొలగించడానికి చర్యలు తీసుకోకపోవడంతో, శ్రీ వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చిందం నరసయ్య, బొంతల కళ్యాణ్ చంద్ర సోమవారం రోజున జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు .ప్రస్తుతం జిల్లా కలెక్టర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా ఉండడంతో భవి ష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇక్కడి రోడ్డును రెండు వరుసలతో , సెం ట్రల్ లైటింగ్ వ్యవస్థతో ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని , ప్రస్తుతం తక్షణ చర్యల కింద రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు , చెట్లను తొలగించి , మట్టి తో నైనా రహదారిని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని చిందం నరసయ్య, కళ్యాణ్ చంద్ర ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను కోరారు.

# సెట్టింగ్స్ మారిస్తే సైబర్ క్రైమ్ కు దూరం

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** కొంతకాలంగా ఆన్‌లైన్ మోసాల కేసులు వేగంగా పెరుగుతున్నాయి. సైబర్ నేరస్థులు ఎక్కువగా వాట్సాప్ వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇక్కడ నకిలీ సందేశాలు, ఫిషింగ్ లింక్‌లు, కాల్‌ల ద్వారా అమాయక ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ మీరు అస్సలు ఆందోళన చెందకూడదు. వాట్సాప్‌లో కొన్ని ప్రైవసీ సెట్టింగ్‌లను ఆన్ చేయడం ద్వారా మీరు ఈ ఆన్‌లైన్ మోసాలను నివారించవచ్చు. మీరు ఇప్పుడే ఆన్ చేయవలసిన ప్రత్యేక సెట్టింగ్‌ల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.మీ ప్రొఫైల్ చిత్రాన్ని చూసి కూడా చాలా మంది స్కామర్లు మిమ్మల్ని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంది. అంతేకాదు మీ ఫోటోను కూడా దుర్వినియోగం చేసే అవకాశం ఉంది. అందుకే మీ ప్రొఫైల్ చిత్రాన్ని ఎప్పుడు తెలియని వ్యక్తులకు కనిపించకుండా మీ ప్రొఫైల్ లో ఉన్నవారు మాత్రమే చూసేలాసెట్ చేయాలి. దీన్నిమార్చడానికి, ముందుగా మీరు సెట్టింగ్‌లు ప్రైవసీ ప్రొఫైల్ ఫోటోకి వెళ్లాలి. అక్కడ ఓన్లీ మై కాంటాక్ట్స్ మీద క్లిక్ చేయండి. మీరు లాస్ట్ సీన్ వివరాలు, ఎబౌట్ లను వాట్సాప్‌లో అందరికీ ఓపెన్ చేసి ఉంచితే స్కామర్లు మీ కార్యాచరణను ట్రాక్ చేయవచ్చు. అవును, ఈ రోజు ఆ వ్యక్తి ఎప్పుడు ఆన్‌లైన్‌లోకి వచ్చాడనే దాని గురించి సమాచారం పొందడానికి ఇలాంటి యాప్‌లు చాలా అందుబాటులో ఉన్నాయి. దీనితో, స్కామర్లు మీరు ఏసమయం లో ఎక్కువగాయాక్టివ్‌గా ఉంటారు? మిమ్మల్ని ఎప్పుడు లక్ష్యంగా చేసుకోవడం ఉత్తమం వంటి ప్లాన్ లు వేసుకుంటారు. కాబట్టి, 'లాస్ట్ సీన్' 'ఎబౌట్' లను ఆఫ్ చేయండి.ఈ జాబితాలో ఇది అతి ముఖ్యమైన సెట్టింగ్, దీనిని మీరు అస్సలు లైట్ తీసుకోవద్దు.



నిజానికి, మీరు ఈ సెట్టింగ్‌ని ఆన్ చేసిన తర్వాత, మీ అనుమతి లేకుండా ఎవరూ మీ వాట్సాప్‌ను ఉపయోగించలేరు. ఈ సెట్టింగ్‌ని ఆన్ చేయడం ద్వారా, ఎవరైనా మీ ఓటీపీని తీసుకోవాలి అనుకున్నా సరే వారు మీ వాట్సప్‌ఖాతాను ఉపయోగించలేరు. మీఖాతాలోకి లాగిన్ అవ్వడానికి ఓటీపీ తర్వాత 6అంకెల పిన్‌ను నమోదు చేయమని స్కామర్ మిమ్మల్ని అడుగుతాడు. అయితే ఈ సెట్టింగ్‌ను ఆన్ చేయడానికి, ముందుగా వాట్సాప్ సెట్టింగ్‌లకు వెళ్లండి.

దీని తరువాత, సెట్టింగ్‌లలో ప్రైవసీ ∩ డబుల్ వెరిఫికేషన్ పై క్లిక్ చేయండి. ఇక్కడ మీరు6అంకెల పిన్ సెట్ చేసుకోవచ్చు. అంతేకాదు ఇప్పుడు మీరు మీ ఇమెయిల్ ఐడిని ఇక్కడ యాడ్ చేయాలి. తద్వారా మీరు పిన్‌ను మరచిపోతే దాన్ని మళ్ళీ రీసెట్ చేయవచ్చు.కొంతకాలంగా,స్కామర్లు మొదట మీ ప్రయోజనాల గురించి పెద్ద పెద్ద విషయాలు చెప్పే గ్రూపులో చేర్చుతారు. కానీ మీరు వారి ఉచ్చులో పడితే,అది మీబ్యాంక్ ఖాతాను కూడా ఖాళీ చేస్తుంది. అందువల్ల, మిమ్మల్ని ఎవరు గ్రూప్ లో యాడ్ అవమని అడిగినా సరే అవద్దు.

# అందుబాటులోకి ఆధార్ కొత్త యాప్..!

న్యూఢిల్లీ: ఇకపై ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాల్సిన పనిలేదు. ఈ మేరకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) త్వరలో కొత్త ఆధార్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్టు కేంద్ర ఎలక్ట్రానిక్స్,ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఈయాప్ ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ వంటి ఫీచర్ల ఆధారంగా పనిచేయనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్త ఆధార్ మొబైల్ యాప్‌ను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రారంభించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎంఆధార్ యాప్‌తో పోలిస్తే రీడిజైన్ చేసిన ఇంటర్‌ఫేస్‌ను ఇది కలిగి ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రస్తుతం కొత్త యాప్ బీటా టెస్టింగ్ దశలో ఉందని, త్వరలో దేశవ్యాప్తంగా డిజిటల్ ఆధార్ కార్డ్ అందుబాటులోకి రానున్నట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

కొత్త యాప్‌లో, మొత్తం ప్రక్రియ ముఖ ప్రామాణీకరణ సహాయంతో జరుగుతుందని మంత్రి అన్నారు. మంత్రి అశ్విని వైష్ణవ్ చీ ప్లాట్‌ఫామ్ లో ఒకవీడియోను పోస్ట్ చేశారు, అందులో ఆయన స్వయంగా కొత్త ఆధార్ యాప్ గురించి వివరించి ఒక చిన్న వీడియోను పోస్ట్ చేశారు. ఆయన కొత్త ఆధార్ యాప్, మొబైల్‌యాప్ ద్వారాఫేస్ ఐడి ప్రామాణీకరణ గురించి చెప్పారు. దీనితో పాటు అతను తొమ్మిది భౌతిక కార్డులు మరియు తొమ్మిది ఫోటోకాపీలు వంటి పదాలను ఉపయోగించారు. వెరిఫికేషన్ సమయంలో ఆధార్ యాప్‌తో స్కాన్ చేయడం ద్వారా సులభంగా పూర్తి చేయవచ్చు. ప్రస్తుతం యూపీఐ లాంటి చెల్లింపుల క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న తరహాలోనే ఇది కూడా పని చే య




నున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. దీనివల్ల అత్యంత సురక్షితంగా, సులభంగా ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందని మంత్రి వెల్లడించారు. కొత్త యాప్ అందుబాటులోకి వచ్చిన తర్వాత నుంచి ప్రజలుతమమొబైల్ ఫోన్ నుంచి ఆధార్‌ను షేర్ చేసుకోవచ్చని తెలిపారు.ఇది అన్ని చోట్ల,అన్ని పనులకు ఉపయోగించవచ్చని, చేతిలో ఆధార్‌కార్డును పట్టుకెళ్లాల్సిన పని ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఆధార్‌కొత్త యాప్‌లో ప్రత్యేకతలుః కొత్తఆధార్ యాప్ ద్వారాఫేస్ ఐడి, క్యూఆర్ స్కానింగ్ ద్వారా డిజిటల్ వెరిఫికేషన్ జరుగుతుంది. కొత్త ఆధార్ యాప్ తో వినియోగదారుల అనుమతి లేకుండా డేటా షేర్ చేయడం జరగదు, గోప్యత పెరుగుతుంది. ధృవీకరణ కోసం ఫోటోకాపీని అందించాల్సిన అవసరం ఉండదు. హోటళ్ళు, విమానాశ్రయాలలో ఫోటోకాపీలను అందించాల్సిన అవసరం ఉండదు. కొత్త ఆధార్ యాప్ తో మోసానికి అవకాశం ఉండదు.

# వరంగల్ లో గోల్డ్ లోన్ ఏటీఎం



**వరంగల్,తెలంగాణ దిశ:**అర్జెంటుగా డబ్బులు అవసరం పడితే చాలా మంది బ్యాంకులో గోల్డ్ లోన్ తీసుకుంటుంటారు. బ్యాంకుకు వెళ్లి తమ వద్ద ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చుకుంటుంటారు. అయితే ఇది కొంచెం టైం టేకెన్ ప్రాసెస్. ముందుగా బ్యాంకుకు వెళితే.. అక్కడున్న గోల్డ్ అప్రైజర్ మన బంగారాన్ని తనిఖీ చేస్తాడు. ఎన్ని క్యారెట్లు.. ఎంత బరువుంది.. ఆ రోజు ధర ఎంతో లెక్కగట్టి బ్యాంకు అధికారులకు చెబుతారు. అప్రైజర్ ఇచ్చే రిపోర్టు ఆధారంగానే బ్యాంకులు గోల్డ్ లోన్ మంజూరు చేస్తాయి. ఆ తర్వాత బ్యాంకు అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయి. ఈ ప్రాసెస్ జరగటానికి కొన్ని సార్లు రోజు మె?త్తం పట్టే ఛాన్సు ఉంటుంది.ఇక నుంచి ఆ టెన్షన్ అక్కర్లేదు. నిమిషాల వ్యవధిలోనే బంగారంపై గోల్డ్ లోన్ పొందొచ్చు. ఈ మేరకు గోల్డ్‌లోన్ ఏటీఎంలు అందుబాటులోకి వచ్చాయి. సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో ఈ గోల్డ్ లోన్ ఏటీఎం ప్రారంభించారు. దేశంలోనే తొలిసారి ప్రయోగాత్మకంగా వరంగల్‌లో గోల్డ్ లోన్ ఏటీఎం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఎంవీరావు తెలిపారు. ఈ గోల్డ్ లోన్ ఏటీఎం ద్వారా చాలా సులభంగా లోన్ తీసుకోవచ్చునని చెప్పారు. ఈ యంత్రం వల్ల బ్యాంకు సిబ్బందికి, అలాగే ఖాతాదారుడికి సమయం ఆదా అవుతుందని అన్నారు. వరంగల్ నగరంలో విజయవంతమైతే దేశంలోని మిగతా ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.ఎలా పని చేస్తుందంటే..?: కొత్తగా ప్రారంభించిన గోల్డ్‌లోన్ ఏటీఎం ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్) సాంకేతికతతో రూపొందించారు.కేవలం 10 నుంచి 12 నిమిషాల్లోనే ఆధార్ కార్డు, మొబైల్ నంబరు ఆధారంగా ఏటీఎం సాయంతో గోల్డ్‌లోన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. లోన్ కావాలనుకునేవారు బ్యాంకు అకౌంట్ వివరాలు, ఆధార్ కార్డు నెంబర్, మె?బైల్ నెంబర్ ఏటీఎం మిషన్ అడిగే ఆప్షన్‌లో ఎంటర్ చేయాల్సి ఉంటుంది.ఆ తర్వాత బంగారు ఆభరణాలు మిషన్‌లోని బాక్సులో వేయాలి. ఏఐ టెక్నాలజీ ద్వారా బంగారం నాణ్యత, బరువును, ఆరోజు ఉన్న మార్కెట్ ధరను లెక్క కడుతుంది. దాని ప్రకారమే చెల్లింపులు ఉంటాయి.పై ప్రక్రియ పూర్తయిన తర్వాత గోల్డ్‌లోన్ ఏటీఎం ద్వారా 10 శాతం డబ్బులు వెంటనే తీసుకోవచ్చు.మిగతా నగదును ఖాతాదారుడి అకౌంట్‌లో జమ అవుతాయి.ప్రస్తుతం సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతాదారలకు మాత్రమే గోల్డ్‌లోన్ ఏటీఎం ద్వారా లోన్లు తీసుకునే ఛాన్స్ ఉంది.

# పత్తి ధరపై ప్రైవేటు కత్తి...!

## భారీగా కోత పెడుతున్న వ్యాపారులు!



**అమరావతి,తెలంగాణ దిశ:**కంద్రం మద్దతు ధర ప్రకటించినా... భారతీయ పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోంది. పల్నాడు జిల్లాలో ప్రైవేటు వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలుకు రూ. 5,500 నుంచి రూ. 6,500 వరకు ఇస్తున్నారు. అక్టోబరు 1 నాటికి కొనుగోలు కేంద్రాలను తెరవాల్సిన సీసీఐ వర్షాలు, ఇతరత్రా కారణాలతో జాప్యం చేస్తోంది. మరోవైపు మిర్చి, వరి పంటలకు పెట్టుబడులు పెట్టాల్సిన రైతులు పత్తి దిగుబడులను వెంటనే అమ్మేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు వ్యాపారులు ధరలను బాగా తగ్గించేస్తున్నారు. క్వింటా మద్దతు ధర రూ.7,521 : కేంద్రం ఈ ఏడాది క్వింటా పత్తికి మద్దతు ధర రూ. 7,521గా నిర్ణయించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాగు విస్తీర్ణం ఆధారంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీసీఐ నిర్ణయించింది. ఎంపిక చేసిన జిన్నింగ్ మిల్లుల్లో సైతం కొను గోలుకు ఏర్పాట్లు చేసింది. అయితే సాంకేతిక కారణాలతో కేంద్రాలు తెరవడంలో జాప్యం చోటుచేసుకుంటోంది.

మార్కెటింగ్, రెవెన్యూ, వ్యవసాయశాఖ, సీసీఐ అధికారులు ఇప్పటికే సమావేశమై వివిధాం శాలపై చర్చించారు. వ్యవసాయశాఖ నుంచి ఈ-పంట, ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు సేకరించిన మార్కెటింగ్‌శాఖ డేటా సిద్ధం చేసింది. పత్తి కొనుగోలుకు సీసీఐ మాత్రం ముందుకు రావడం లేదు. వర్షాల కారణంగా నాణ్యత లేని పత్తి మార్కెట్‌కు వస్తోందని చెబుతూ ప్రైవేటు వ్యాపారులు ధరలో కోత విధిస్తున్నారు.

ఒకవైపు వర్షాలు, నిల్వ చేసుకో వడానికి ఇబ్బందులు.. మరోవైపు పెట్టుబడులకు సొమ్ము అవసరమైన పరిస్థితుల్లో రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తోంది. వర్షాలకు కొంత నాణ్యత తగ్గినా క్వింటాకు కనీసం రూ. 7 వేలైనా వస్తుందని రైతులు ఆశించినా పరిస్థితులు వేరేవిధంగా ఉన్నాయి. సీసీఐ వెంటనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ.. పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215